RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 257 మేడ్చల్ మల్కాజ్‌గిరి 10 అక్టోబర్ 2024 గురువారం పేజీలు : 4

## 50 మంది సీనియర్ డాక్టర్ల రాజీనామా

కోల్‌కతా : జూనియర్ వైద్యురాలి హత్యాచార ఘటనలో పశ్చిమబెంగాల్‌లోని కోల్‌కతా ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

బాధితు రాలికి న్యాయం చేయాలని, పని ప్రదేశాల్లో భద్రత కల్పించాలనే డిమాండ్లతో నాలుగు రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న జూనియర్ వైద్యులకు సంఘీభావంగా దాదాపు 50 మంది సీనియర్ డాక్టర్లు మూకుమ్మడి రాజీనామాలు చేశారు. ఈ మేరకు డిపార్ట్‌మెంట్‌ల హెడ్‌ల సమావేశంలో నిర్ణయం జరిగిందని సంబంధిత వర్గాలు వెల్లడించాయి.

శనివారం నుంచి నిరాహార దీక్ష చేస్తున్న పలువురు జూనియర్ వైద్యులకు సంఘీభావంగా 15 మంది సీనియర్ వైద్యులు దీక్షలో కూర్చున్నారు.




# డీఎస్సీ విజేతలను చూస్తుంటే... దసరా ముదుగానే వచ్చినట్లుంది!

## డిఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేసిన సీఎం రేవంత్‌రెడ్డి

## 'ప్రైవేటు'లో మీకంటే గొప్పవారు ఉన్నారా?: డీఎస్సీ విజేతలతో సీఎం రేవంత్

హైదరాబాద్: డీఎస్సీ విజేతలను చూస్తే దసరా పండుగ ముందే వచ్చినట్లు అనిపిస్తోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. టీచర్లే తెలంగాణ వారధులు.. నిర్మాతలని, పేద విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దే బాధ్యత వారిపైనే ఉందని తెలిపారు. హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో డీఎస్సీ విజేతలకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ కొత్త టీచర్లకు కీలక సూచనలు చేశారు. నిరుపేదలు బంగారం అమ్మి ప్రైవేటు పాఠశాలలకు పిల్లల్ని పంపే పరిస్థితి మారాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులే ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించాలన్నారు. "తెలంగాణ బిడ్డలకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు వారిని భవిష్యత్తులో డాక్టర్లుగా, లాయర్లు, ఇంజినీర్లు, సైంటిస్టులు, ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రజాప్రతినిధులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మీదే. నేను ప్రభుత్వ బడిలో చదువుకున్నా.. సీఎం అయ్యాను. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేశవరావు, కోదండరాం వంటి ఎందరో ప్రభుత్వ బడిలోనే చదివారు. కార్పొరేట్ బడిలో చదువుకోలేదు. మీలాంటి టీచర్లు చెప్పిన చదువుతోనే ఈ స్థాయికి వచ్చాం. జాతి నిర్మాతలను తీర్చిదిద్దిన క్షేత్రం ప్రభుత్వ బడి. తెలంగాణలో 30వేల పాఠశాలలు ఉంటే.. 24లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటు యాజమాన్యంలో 10 వేల పాఠశాలలు ఉంటే 34లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. ప్రైవేటులో మీకంటే ఎక్కువ చదువుకున్నవారు, మీకన్నా గొప్ప వ్యక్తులు, అనుభవం ఉన్నవారు బోధిస్తున్నారా?" అని ప్రశ్నించారు.

**ఎందుకలా జరుగుతోందో ఆలోచించండి..** "ప్రభుత్వ బడికి వెళ్లడమంటేనే గ్రామాల్లో సైతం నామోషీగా భావిస్తున్నారు. ఉపాధి హామీ కూలికి పోయిన వారు కూడా తాము తిన్నా తినకపోయినా, పుస్తెలు అమ్మి అయినా తమ పిల్లలను ప్రైవేటు బడి, కాన్వెంట్‌కు పంపాలనుకుంటున్నారు. ప్రభుత్వ పాఠశాలకు పంపాలంటే.. ఎందుకు ఇబ్బందిపడుతున్నారో ఆలోచించండి. మీకు ఏ సమస్య ఉన్నా పరిష్కరించే బాధ్యత నేను తీసుకుంటా.. కానీ, విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు మీరు కృషిచేయండి. స్కూళ్లలో అన్ని వసతులూ కల్పించేందుకు కృషిచేస్తున్నాం. అన్ని నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు ప్రారంభిస్తున్నాం. ఈ నెల 11న ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు శ్రీకారం చుడుతున్నాం. విద్యకు బడ్జెట్‌లో రూ.25వేల కోట్లు కేటాయించాం. ఐటీఐలను అడ్వాన్స్ టెక్నాలజీ సెంటర్లుగా ఆధునీకరిస్తున్నాం.

**65 రోజుల్లోనే డీఎస్సీ ప్రక్రియ పూర్తిచేశాం..** "ప్రత్యేక తెలంగాణ కోసం నిరుద్యోగులు ఆత్మబలిదానాలు చేసుకున్నారు. రెండుసార్లు కోరి కొరివి దెయ్యాన్ని తెచ్చుకున్నట్లుగా బీఆర్‌ఎస్‌కు అధికారం ఇచ్చాం. ప్రత్యేక తెలంగాణలో ఉద్యోగాలు భర్తీ అవుతాయని అందరూ ఆశించినా.. తెలంగాణ వచ్చిన మూడేళ్లకు డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చిన రెండేళ్లకు నియామక ప్రక్రియ పూర్తి చేశారు. గత ప్రభుత్వం నిరుద్యోగుల సమస్యలు తీర్చలేదు. యువతకు ఉద్యోగాలు రావాలంటే.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావు, కవిత ఉద్యోగాలు ఊడాలని గతంలో చెప్పాను. కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని నిరుద్యోగులు బాధ్యత తీసుకున్నారు. 90 రోజుల్లో 30వేల కొలువులు భర్తీ చేసి నియామక పత్రాలు అందజేశాం. 65 రోజుల్లో డీఎస్సీ నియామక ప్రక్రియ పూర్తి చేశాం.

**పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కవితకు ఎమ్మెల్సీ పదవి..** రాష్ట్ర పునర్నిర్మాణంలో ప్రభుత్వ బడుల పాత్ర కీలకం. డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవాలని కొరివి దెయ్యాలు యత్నించాయి. కేసులు వేసి డీఎస్సీ నోటిఫికేషన్ అడ్డుకోవడానికి కుట్రలు చేశారు. రాష్ట్ర పునర్నిర్మాణంలో భవిష్యత్తు తరాలకు టీచర్లు ఆదర్శంగా మారబోతున్నారు. డీఎస్సీ విజేతల సంతోషాన్ని చూసి కొందరు కళ్లల్లో కారం పెట్టుకొంటారు. ఎంపీగా కవిత ఓడిపోగానే కేసీఆర్ ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల గురించి ఆలోచించలేదు గానీ.. కుమార్తెకు మాత్రం 6 నెలల్లో ఎమ్మెల్సీ పదవి ఇచ్చారు. పేదల మేలు కోసం విశ్రాంతి తీసుకోకుండా శ్రమిస్తున్నాం. బాధ్యత కలిగిన ప్రతిపక్షంగా సలహాలు, సూచనలు ఇవ్వాలి. తెలంగాణ సమాజంపై బీఆర్‌ఎస్‌కు ఎందుకంత కోపం? ఏడు లోక్‌సభ స్థానాల్లో బీఆర్‌ఎస్‌కు డిపాజిట్లు పోయాయి. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలని ప్రజలు మాకు అధికారం ఇచ్చారు. మా ప్రభుత్వాన్ని పడగొడతామని బీఆర్‌ఎస్ అంటోంది.. ఇది న్యాయమా? బీఆర్‌ఎస్‌కు అధికారం రాదు.. తెలంగాణ ప్రజలు ఇవ్వరు?

**ఒలింపిక్స్‌లో పతకాలు రావడంలేదెందుకు?..** విద్యార్థులకు సాంకేతిక శిక్షణ ఇచ్చి.. ఉద్యోగ అవకాశాలను పెంపొందిస్తాం. రాష్ట్రంలో ఏటా 1.10లక్షల మంది విద్యార్థులు ఇంజినీరింగ్ పట్టాలు పొందుతున్నారు. నైపుణ్యాలు పెంపొందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీని ప్రారంభించాం. స్కిల్ వర్సిటీ ద్వారా సాంకేతిక నైపుణ్యం అందిస్తున్నాం. ఒలింపిక్స్ వేదికల్లో దేశం పరిస్థితి ఏంటో చూశాం.

నాలుగు కోట్లు జనాభా ఉన్న దక్షిణ కొరియాకు ఒలింపిక్స్‌లో 32 పతకాలు వస్తే.. 140 కోట్ల జనాభా ఉన్న భారత్‌కు ఆ తరహాలో ఒలింపిక్స్‌లో ఎందుకు పతకాలు రాలేదు? తెలంగాణ యువత మత్తుకు బానిసలయ్యారు. వ్యసనాలకు బానిసలై.. యువత తప్పుదోవ పడుతున్నారు. 2028 ఒలింపిక్స్‌లో తెలంగాణ అథ్లెట్లకు బంగారు పతకాలు రావాలి" అని పిలుపునిచ్చారు.



## సీఎం రేవంత్ రెడ్డికి రూ.5.5 కోట్ల చెక్ ను అందజేసిన ఎల్ అండ్ టీ..

హైదరాబాద్ : రాష్ట్రంలో నెలక్రితం కురిసిన భారీ వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, ములుగులో పంట నష్టంతో పాటు ఆస్తి, ప్రాణ నష్టం సంభవించింది. దీంతో వర్షాలతో నష్టపోయిన వారిని ఆదుకునేందుకు సినీ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చారు. భారీ ఎత్తున విరాళాలు ప్రకటించారు. తాజాగా లార్సెన్ అండ్ టూబ్రో వరద బాధితులకు సాయం చేయాలనే ఉద్దేశంతో తెలంగాణ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ. 5.5 కోట్ల విరాళం ఇచ్చారు. బుధవారం తెలంగాణ సచివాలయంలో ఎల్‌అండ్ టీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌ఎన్ సుబ్రహ్మణ్యన్ చెక్కును సీఎం రేవంత్ రెడ్డికి అందించారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఎల్‌అండ్ టీ ప్రతినిధులు ఉన్నారు. మెగాస్టార్ చిరంజీవి కూడా సీఎం రేవంత్ రెడ్డిని చెక్కులు ఇచ్చారు. చిరంజీవి, తన కుమారుడు రామ్ చరణ్ వేర్వేరుగా రెండు తెలుగు రాష్ట్రాలకు కోటి రూపాయల విరాళాన్ని ప్రకటించగా.. ఆ చెక్కులను అందించారు. మహేశ్ బాబు దంపతులు కూడా రేవంత్ రెడ్డిని కలిసి చెక్ అందించారు. బాలకృష్ణ చిన్న కూతురు కూడా సీఎం రేవంత్ రెడ్డిని కలిసి చెక్ ఇచ్చారు. ఇలా టాలీవుడ్ చెందిన ప్రముఖులు ప్రకటించిన ప్రకారం చెక్కులు అందజేశారు. కుమారి ఆంటీ కూడా వరద బాధితుల సహాయం కోసం విరాళం ఇచ్చిన సంగతి తెలిసిందే. కుమారి అంటీ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50 వేల చెక్కును ఇచ్చారు. సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఆమె చెక్ అందజేశారు. ప్రజలను ఆదుకోవడానికి ముందుకొచ్చిన దాతలకు ప్రభుత్వం ధన్యవాదాలు తెలిపింది.

## ధాన్యం సేకరణపై కేబినెట్ సబ్ కమిటీ నియామకం

హైదరాబాద్ : ధాన్యం సేకరణకు సంబంధించిన పలు అంశాలపై అధ్యయనం చేసి సిఫార్సులు చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ ఉపసంఘాన్ని నియమించింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, తుమ్మల నాగేశ్వరరావుతో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసింది. పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ కమిటీకి కన్వీనర్‌గా ఉంటారు. గోదాముల లీజు, రైస్ మిల్లర్ల నుంచి బ్యాంకు గ్యారంటీలు, మిల్లింగ్ ఛార్జీలు, తదితర అంశాలపై మంత్రివర్గ ఉపసంఘం అధ్యయనం చేసి ప్రభుత్వానికి నివేదిక ఇస్తుంది.

# తెలంగాణ సర్కార్ కీలక నిర్ణయం..

## ఎస్సీ వర్గీకరణకు ఏకసభ్య కమిషన్..!



హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక ప్రకటన చేశారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణ అమలు చేసేందుకు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలంటూ అధికారులను సీఎం ఆదేశించారు. ఆ కమిషన్ 60రోజుల్లో నివేదిక ఇచ్చేలా చూడాలంటూ సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నివేదిక వచ్చిన తర్వాత మాత్రమే రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగాలకు కొత్త నోటిఫికేషన్లు ఇవ్వనున్నట్లు ఆయన వెల్లడించారు. వర్గీకరణనకు 2011 జనాభా లెక్కలను పరిగణలోకి తీసుకోనున్నట్లు రేవంత్ చెప్పారు. మరో 24గంటల్లో కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు తెలంగాణలో ఎస్సీ వర్గీకరణపై కొన్ని రోజులుగా కాంగ్రెస్ సర్కార్ కసరత్తు చేస్తోంది. దీనిపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేయగా.. పలు అంశాలపై చర్చించిన సబ్ కమిటీ సభ్యులు ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి, సబ్ కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు సమావేశమై ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై పలు విమర్శలు గుప్పించారు. రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. " కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణలో కొరివి దయ్యాన్ని కొని తెచ్చుకుని రెండు సార్లు ముఖ్యమంత్రిని చేశారు. ఆ కొరివి దయ్యం నిరుద్యోగ సమస్యను పట్టించుకోలేదు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత ఉద్యోగాలు ఊడితేనే మీకు ఉద్యోగాలు వస్తాయని నేను ముందే చెప్పాను. చెప్పినట్లుగానే ఉద్యోగాలు భర్తీ చేస్తున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 90రోజుల్లో 30వేల మందికి ప్రభుత్వ ఉద్యోగాల నియామకపత్రాలు అందించాం. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల బదిలీ సమస్యను పరిష్కరించాం. 34వేల మందిని బదిలీలు చేశాం. మీ సంతోషం చూసి కొందరు కళ్లల్లో నిప్పులు పోసుకుంటున్నారు. కేసీఆర్ నువ్వు చేసిన తప్పిదాలకు నీ బిడ్డని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిస్తే ఎమ్మెల్సీని చేశావు. నీ బంధువు బోయినపల్లి వినోద్‌ను ఓడిస్తే ప్లానింగ్ కమిషన్ వైస్ ఛైర్మన్‌ను చేశావు. తెలంగాణ కోసం త్యాగం చేసిన నిరుద్యోగ బిడ్డలకు ఉద్యోగాలు ఎందుకు ఇవ్వలేదు. మీ ఇంట్లో సంతోషం ఉండాలి కానీ పేద ప్రజల ఇళ్లలో వద్దా? ఒక్కరోజు సెలవు తీసుకోకుండా పేదలు, నిరుద్యోగుల కోసం పనిచేస్తున్నా. ప్రతిపక్ష నేతగా అసెంబ్లీకి వచ్చి కేసీఆర్ సలహాలు ఇవ్వాలి. అదీ చెయ్యడం లేదు. రాష్ట్రంలో 30వేల ప్రభుత్వ పాఠశాలలు ఉంటే 24లక్షల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. 10 వేల ప్రైవేటు పాఠశాలలుంటే 34 లక్షల మంది విద్యను అభ్యసిస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలలకు పిల్లల్ని పంపించాలంటే తల్లిదండ్రులు నామోషీగా ఫీల్ అవుతున్నారు. ఆ పరిస్థితిని మారుస్తా. ప్రభుత్వ విద్యాసంస్థలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దుతున్నాం. ఈనెల 11న 25 జిల్లాల్లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్‌కు శంకుస్థాపన చేస్తున్నాం" అని చెప్పారు. మరోవైపు ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను ఇవాళ(బుధవారం) హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ ఆధ్వర్యంలో ఇవాళ ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. అయితే ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. మందకృష్ణ మాదిగతోపాటు పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను ఖాకీలు అదుపులోకి తీసుకున్నారు.

ఈ క్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట, ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకూ నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళనకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణకు సీఎం రేవంత్ రెడ్డి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది.

# సంపాదకీయం

## కాంగ్రెస్ గెలిచే చోటా ఓడిన వైనం.. ఏంటి కారణాలు?

జాతీయ పార్టీ కాంగ్రెస్‌కు తాజాగా రెండు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో భారీ ఎదురు దెబ్బ తగిలింది. గెలిచేందుకు ఎంతో అవకాశం ఉండి.. గెలుస్తారన్న ధీమా కూడా ఉన్న హరియాణాలో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. వాస్తవానికి ఏ రాష్ట్రంలో అయినా.. ఒక పార్టీ వరుసగా మూడు సార్లు అధికారం దక్కించుకున్న దాఖలాలు ఇటీవల కాలంలో అయితే లేవు(ఒక్క గుజరాత్ మినహా). అలాంటిది తొలిసారి గుజరాత్‌కు ఆవల హరియాణాలో వరుసగా మూడోసారి బీజేపీ ఏకపక్షంగా విజయం దక్కించుకుంది. ఇది ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఎదురు దెబ్బేనని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. హరియాణ ఎన్నికల షెడ్యూల్ నుంచి పోలింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు కూడా ప్రజల నాడిని పట్టుకున్న అనేక సర్వేలు.. కాంగ్రెస్‌దే అధికారమని ఢంకా భజాయించి మరీ చెప్పాయి. కొన్ని కొన్నిసర్వేలు..ఏకపక్షంగా పోలింగ్ జరిగినా ఆశ్చర్యం లేదని పేర్కొన్నాయి. ఇక, మంగళవారం ఎన్నికల ఓట్ల కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత తొలి రెండు రౌండ్లు కూడా.. కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలోనే కొనసాగింది. దీంతో ఇంకేముంది.. తాము గెలిచేస్తున్నాం.. అంటూ పార్టీ కార్యాలయాల వద్ద మిన్నంటిన సంబరాలు చేసుకున్నారు. మిఠాయిలు పంచుకున్నారు. కానీ, గంటలు గడుస్తున్నకొద్దీ.. రౌండ్లు పెరుగుతున్న కొద్దీ.. కాంగ్రెస్ వెనుకబడి పోవడం.. కమల వికాసం కనిపించడంతో సర్వత్రా.. బాంబు పేలినంత విస్మయం.. అసలు ఏం జరుగుతోంది? అని అనేక మంది విస్మయం వ్యక్తం చేశారు. వెరసి.. కౌంటింగ్ ప్రక్రియ ముగిసే సమయానికి బీజేపీ కూటమి 48 స్థానాల్లో విజయం దక్కించుకుంది. ఇక, కాంగ్రెస్ పార్టీ 36 స్థానాలకే పరిమితం అయింది. ఇతరులు 5 స్థానాల్లో విజయం దక్కించుకున్నారు. ఈ ఫలితాలు ఎలా ఉన్నా.. అసలు అనేక ఇబ్బందులతో బీజేపీ ఉన్న సమయంలో కాంగ్రెస్ పార్టీ పుంజుకోకపోవడమే ఇప్పుడు ప్రధాన సమస్యగా మారిపోయింది.

**ఏంటి కారణాలు? :** బీజేపీ వ్యతిరేకతను అందిపుచ్చుకోవడంలో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందనే వాదన వినిపిస్తోంది. ముఖ్యంగా జేజేపీ వంటి పార్టీలు బీజేపీని వ్యతిరేకించిన తర్వాత.. ఆ పార్టీ ప్రభుత్వానికి మద్దతును ఉపసంహరించుకున్న తర్వాతకూడా.. కాంగ్రెస్ పుంజుకోలేని పరిస్థితి ఏర్పడింది. ఇక, బ్రాహ్మణ, క్షత్రియ సామాజిక వర్గాలను ఆకట్టుకోవడంలోనూ కాంగ్రెస్ విఫలమైంది. ప్రధానంగా.. అగ్నివీర్‌ను రద్దు చేస్తామన్న కాంగ్రెస్ హామీని ప్రజలు విశ్వసించలేక పోయారు. రైతుల పంటలకు కనీస మద్దతు ధరల ప్రకటన విషయంలోనూ.. బీజేపీని దీటుగా కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొనలేక పోయింది. ఇక, మోడీ, అమిత్ షా ద్వయానికి చెక్ పెట్టడంలోనూ రాహుల్ గాంధీ దూకుడు ఏమాత్రం పనిచేయలేక పోయింది. అందుకే.. గెలిచే అవకాశం ఉన్న చోట కూడా.. కాంగ్రెస్ పార్టీ పట్టాలు తప్పేసింది.

## పదేళ్లుగా పనిచేస్తున్న.. ఉద్యోగోన్నతులు సున్నా!



ఖమ్మం : విద్యుత్తు సంస్థలో ఉపకేంద్రాల నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్లు, వివిధ విభాగాల్లో వాచ్‌మెన్లుగా ఆర్టిజన్ (ఔట్ సోర్సింగ్) కార్మికులు దశాబ్ద కాలానికి పైగా పనిచేస్తున్నారు. 2017 సెప్టెంబర్‌లో వీరిని ఆర్టిజన్ కార్మికులుగా యాజమాన్యం గుర్తించింది. ప్రభుత్వం ఆర్టిజన్లుగా గుర్తించి ఏడేళ్లు గడిచినా న్యాయం జరగటం లేదు. పని భారంతో శ్రమదోపిడీకి గురవుతున్నారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు నిబంధనలు వర్తింపజేయలేదు. అందుకే ఉద్యోగోన్నతి పొందలేకపోతున్నామని కార్మికులు వాపోతున్నారు.

**ఖమ్మం సర్కిల్ పరిధిలో..**

టీజీఎస్పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ (జిల్లా) పరిధిలో 286 మంది ఆర్టిజన్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరిలో పీజీ అభ్యసించినవారు గ్రేడ్-1గా, డిగ్రీ చదివినవారు గ్రేడ్-2, పదోతరగతి అభ్యసించినవారు గ్రేడ్-3, నిరక్షరాస్యులు, పదోతరగతి లోపు చదివినవారిని గ్రేడ్-4 కార్మికులుగా విభజించారు. అయితే ఉపకేంద్రాల్లో ఆపరేటర్లుగా పనిచేస్తున్న కార్మికులు, ఇతర ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్నవారు పనిభారంతో సతమతమవుతున్నారు. సిబ్బంది తక్కువగా ఉండటంతో అధిక గంటలు పనిచేయిస్తున్నారు. అలాగే ముగ్గురు, నలుగురు పనిచేయాల్సిన ప్రాంతంలో ఇద్దరితో సరిపుచ్చుతున్నారు. తద్వారా కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. ఇతర ఉద్యోగులకు అధిక గంటలు పనిచేస్తే అదనపు వేతనం ఇస్తున్నారు. కానీ వీరికి ఆ సౌకర్యమూ లేదు. అలాగే ఇతర విభాగాల్లోనూ అధికారులు పనులు చేయిస్తున్నారు. ఒకే సంస్థలో ఒకే విధమైన విధులు నిర్వర్తించే సిబ్బంది వేతనాల్లో భారీ వ్యత్యాసం ఉంటోందని కార్మికులు ఆరోపిస్తున్నారు.

సాధారణంగా ఉద్యోగులు, కార్మికులకు ప్రొబేషనరీ పీరియడ్ ఐదేళ్లు గడిస్తే ఉద్యోగోన్నతి కల్పించాల్సి ఉంది. ఆర్టిజన్ కార్మికులు ఇటీవల ఏడేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని పూర్తిచేసుకున్నారు. వేతనం, ఇతర లబ్ధిలో నష్టం జరుగుతోందని వాపోతున్నారు. ప్రస్తుతం సంస్థలో ఉద్యోగోన్నతుల ప్రక్రియ జరుగుతోంది. అయినా తమ ఉద్యోగోన్నతులపై అధికారులు చర్చించకపోవటంపై ఆర్టిజన్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంస్థలోని ఇతర విభాగాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఉద్యోగోన్నతి కల్పిస్తుండటంతో కొత్త ప్రభుత్వం తమకూ న్యాయం చేస్తుందని ఆర్టిజన్లు ఆశిస్తున్నారు. తమకు ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్ వర్తింపజేయాలని కోరుతున్నారు. తక్షణమే ఉద్యోగోన్నతులు కల్పించాలని, సెలవులు, వేతనంలో వ్యత్యాసాన్ని సరిచేయాలని, అదనంగా పనిచేస్తే అదనపు వేతనమివ్వాలని విన్నవిస్తున్నారు. తెలంగాణ ఇంక్రిమెంట్లు అన్ని విభాగాల్లో ఇచ్చారని, తమకు కూడా అమలు చేయాలని, కొత్త కార్మికుల నియామకం చేపట్టి పనిభారం తగ్గించాలని కోరుతున్నారు. ఆర్టిజన్ కార్మికుల ప్రొబేషనరీ పీరియడ్ ముగిసి రెండేళ్లయ్యింది. ఉద్యోగోన్నతుల కోసం ఎదురుచూస్తున్నాం. ఏపీఎస్ఈబీ నిబంధనలు వర్తింపజేయాలి. కొత్త కార్మికుల నియామకం చేపట్టి పని ఒత్తిడి తగ్గించాలి. – వల్లాల యుగంధర్, ఖమ్మం డివిజన్ కార్యదర్శి, 327 సంఘం

## తటాకంలో..తలో వాటా..!



భువనగిరి : జిల్లాలో పలు చోట్ల చెరువులు ఆక్రమణలకు గురయ్యాయి. కొన్ని చోట్ల రియల్‌ఎస్టేట్ సంస్థల చెరలో బందీలయ్యాయి. కానీ వాటిని తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. హెచ్ఎండీఏ పరిధిలోని భువనగిరి, చౌటుప్పల్, భూదాన్‌పోచంపల్లి, బీబీనగర్, బొమ్మలరామారం మండలాలతో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగిన యాదగిరిగుట్ట, రాజాపేట, ఆలేరు మండలాల్లో పలు చెరువులు కబ్జాకు గురయ్యాయి. హెచ్ఎండీఏ, నీటిపారుదల, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా హెచ్ఎండీఏ పరిధిలోని మండలాల్లోని చెరువులు, కుంటల కబ్జాపై సర్వే నిర్వహించి 200పైగా చెరువు కుంటలు పాక్షికంగా ఆక్రమణలు జరిగినట్లు గుర్తించారు.ప్రధానంగా భువనగిరి పెద్ద చెరువు, బీబీనగర్ చెరువు ఆక్రమణలకు గురవడంతోపాటు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో నిర్మాణాలు జరిగినట్లు తేలింది. చర్యలు తీసుకునేందుకు నీటి పారుదల శాఖ, రెవెన్యూ అధికారులు వెనుకడుగు వేయడం గమనార్హం. బీబీనగర్ పెద్ద చెరువు పరిధిలోని బఫర్ జోన్‌లో అక్రమ నిర్మాణాలు చేపట్టగా గతంలో తొలగించారు. ఇంకా కొన్ని అలాగే ఉన్నాయి. చౌటుప్పల్ పట్టణంలోని నాగుల కుంటలో ఆక్రమంగా ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. భువనగిరి పెద్ద చెరువును ఆక్రమించి ఓ రియల్ ఎస్టేట్ సంస్థ వెంచర్ వేసింది. దాదాపు ఐదేళ్ల క్రితమే ఆక్రమణ చేశారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో రోడ్లు, మంచినీటి పైప్‌లైన్లు, విద్యుత్ స్తంభాలు వేశారు. చెరువు నీరు లోనికి రాకుండా మధ్యలో మట్టిపోసి అడ్డుగా మట్టితో కట్ట పోశారు. చెరువు విస్తీర్ణం 232 ఎకరాలు ఉంది. 30 మీటర్ల వరకు బఫర్ జోన్ ఉంటుంది. ఈ ప్రదేశంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదు. కానీ నిబంధనలు ఉల్లంఘించి రియల్‌ఎస్టేట్ సంస్థ వెంచర్ చేసింది. నీటి పారుదల శాఖ అధికారులు సర్వే చేసి 8 ఎకరాల్లో వెంచర్ వేసినట్లు తేల్చి ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఏడాది గడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తమ ప్రభుత్వ అనుమతి ఉందని రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధులు బుకాయిస్తున్నట్లు సమాచారం.

తాఖీదులు ఇచ్చాం: భరత్, ఎఈఈ, నీటిపారుదల శాఖ, భువనగిరి చెరువులో ఆక్రమణలు తొలగించాలని సదరు సంస్థకు గతంలోనే తాఖీదులు ఇచ్చాం. తాము సర్వే చేయగా ఎఫ్‌టీఎల్ పరిధిలోని ఎనిమిది ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు తేలింది. ప్రభుత్వ నిర్ణయం మేరకు చర్యలు తీసుకుంటాం. చెరువులో పోసిన కట్టను తొలగిస్తామని రియల్ ఎస్టేట్ సంస్థ జవాబు ఇచ్చిందన్నారు.

## అక్రమాల్లో స్టాంపు



హైదరాబాద్:రాజధాని సమీప జిల్లాల్లో మాజీ సర్పంచుల పేరుతో నిర్మాణ అనుమతుల కుంభకోణం హైడ్రా పరిశీలనతో వెలుగులోకి వచ్చింది. నిబంధనలను తుంగలోకి తొక్కి పదేళ్ల కిందటే మాజీగా మారిన సర్పంచుల అనుమతులు తీసుకున్నట్లు చూపించి నగర సమీప జిల్లాల్లో వేలాది అక్రమ నిర్మాణాలు చేపట్టినట్లు చెబుతున్నారు. ఈనేపథ్యంలో హైడ్రా అధికారులు ఇప్పుడు దీనిపై కూడా దృష్టిపెట్టి ఈ తప్పుడు వ్యవహారంలో పాత్ర ఉన్న మాజీ సర్పంచులు, ఇతర అధికారులపై క్రిమినల్ కేసుల నమోదుకు సిద్ధమవుతున్నారు.

నిబంధనల ప్రకారం భవన నిర్మాణాల అనుమతుల విషయంలో హెచ్ఎండీఏతోపాటు గ్రామ పంచాయతీలు కూడా కొన్ని నిబంధనలను పాటించాలి. ఓఆర్ఆర్ దాటిన తరువాత హెచ్ఎండీఏ పరిధిలోకి వస్తుంది కాబట్టి ఎవరైనా 1200 గజాలకు మించిన స్థలంలో నిర్మాణం చేయాలంటే హెచ్ఎండీఏ అనుమతి ఉండాలి. తక్కువ విస్తీర్ణంలో జీం2 అంతస్తుల్లో నిర్మాణాలకు హెచ్ఎండీఏ సాంకేతిక అనుమతులు తీసుకున్న తరువాతే పంచాయతీ కార్యదర్శి అనుమతులు జారీ చేయాలి. కానీ శివారుల్లో ఇప్పుడు అలా జరగడం లేదు.కార్యదర్శిని కాదని సర్పంచులే..ఒకప్పటి పంచాయతీలు ఇప్పుడు మున్సిపాల్టీలుగా, నగరపాలక సంస్థలుగా మారాయి. కొన్నేళ్లుగా అక్కడ జరిగిన నిర్మాణాలు చూస్తే మాజీ సర్పంచి పేరుతో ఇప్పుడు కూడా అనుమతులు జారీ అవుతున్నాయి. నార్సింగితో పాటు మరికొన్ని ప్రాంతాల్లో హైడ్రా అధికారులు కొన్ని నిర్మాణాలను పరిశీలిస్తే ఈ బాగోతం వెలుగులోకి వచ్చింది. ఎఫ్‌టీఎల్‌లో కొన్ని భవనాలు రెండేళ్ల కిందటే కడితే దానికి పదేళ్ల క్రితం మాజీగా మారిన సర్పంచి అనుమతి ఇచ్చినట్లు చూపించారు. అసలైతే ఆ అనుమతులతో సర్పంచికి సంబంధమే లేదు. పంచాయతీ కార్యదర్శే జారీ చేయాలి. కొన్ని పంచాయతీల్లో అసలు రికార్డులే లేవు. మాజీ సర్పంచులు ఇళ్లలో కొన్ని స్టాంపులున్నాయి. నిర్మాణదారులు ఫైలు తెస్తే మాజీ సర్పంచులు పాత తేదీలతో స్టాంపు వేసి సంతకం చేసి ఇస్తున్నారు. ఇలా ఇప్పటివరకు దాదాపు 200 భవనాలను తప్పుడు అనుమతులతో ఎఫ్‌టీఎల్‌లో నిర్మించినట్లు హైడ్రా పరిశీలనలో తేలింది. మొత్తం మీద నగరం చుట్టుపక్కల జిల్లాల్లో తప్పుడు అనుమతులతో భవనాలు వేలల్లోనే నిర్మాణమైనట్లుగా తేలింది.

అటు రెవెన్యూ.. ఇటు హెచ్ఎండీఏ

మండల రెవెన్యూ అధికారులు కూడా అక్రమార్కులకు తోడ్పాటు అందించారు. ఏకంగా సర్వే నంబరునే మార్చి అక్రమార్కులకు తోడ్పాటునందించారు. తప్పుడు వివరాలతో వస్తే క్షేత్రస్థాయి పరిశీలన చేయకుండానే హెచ్ఎండీఏ అనుమతులిచ్చినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. అక్రమాలకు తోడ్పడిన ఏస్థాయి అధికారి అయినా చర్యలకు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తున్నట్లు కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు.

## శామీర్ పేట పెద్ద చెరువులో 3 లక్షల 60 వేల చేప పిల్లలను వదిలిన ఎంపీ, ఎమ్మెల్యే లు

శామీర్ పేట, (గరుడ వార్త) : మత్స్యకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీ ఈటెల రాజేందర్ ఆకాంక్షించారు. బుధవారం శామీర్ పేట పెద్ద చెరువులో 100% సబ్సిడీ కింద 3 లక్షల 60 వేల విత్తన చేప పిల్లలను ఎమ్మెల్యే లు మల్లారెడ్డి, రాజశేఖర్ రెడ్డి లతో కలిసి చెరువులో వదిలారు. ఈ సందర్భంగా ఎంపీ ఈటెల, ఎమ్మెల్యే మల్లారెడ్డి



లు మాట్లాడుతూ మత్స్య కారులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, ఇందులో భాగంగానే ప్రభుత్వం 100% సబ్సిడీపై 3 లక్షల 60 వేల విత్తన చేప పిల్లలను అందజేసిందని తెలిపారు. మత్స్యకారులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్తు తీగల చోరీ

మెట్‌పల్లి : విద్యుత్తు ఫ్యూజులు పట్టుకొని చూపిస్తున్న ఈ రైతు మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్‌కు చెందిన సామ గంగారెడ్డి. వరద కాలువకు మోటారు అమర్చుకొని పంట పొలానికి సాగునీరందిస్తున్నాడు. మూడ్రోజుల కిందట స్టార్టర్ బాక్సులో ఫ్యూజులు తీసేసి మోటారుకు అనుసంధానించిన విద్యుత్తు తీగను కత్తిరించి అపహరించుకుపోయారు. దీనివల్ల రూ. 5 వేల వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇలాగే జరిగిందని వాపోయారు.

అన్నదాతలకు ఆర్థిక భారం

కాలువల వెంబడి సాగునీటి కోసం అన్నదాతలు ఏర్పాటు చేసుకున్న వ్యవసాయ పంపుసెట్లకు ఉన్న విద్యుత్తు తీగల్లో రాగి తీగే లక్ష్యంగా చేసుకొని దొంగలు చెలరేగిపోతున్నారు. ఒకేసారి ఇరవై, ముప్పై విద్యుత్తు మోటార్ల తీగలను దోచుకెళ్తున్నారు. దీంతో అన్నదాతలకు ఆర్థికంగా భారమవుతోంది. పలుమార్లు విద్యుత్తు తీగలు చోరీకి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఎస్సారెస్పీ కాకతీయ, వరద కాలువలతో పాటు వాగుల వెంబడి వందలాది మంది రైతులు వ్యవసాయ పంపుసెట్లు ఏర్పాటు చేసుకుని పంట పొలాలకు సాగునీరందిస్తున్నారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, కోరుట్ల, కథలాపూర్, జగిత్యాల, మేడిపల్లి, మల్యాల తదితర మండలాల గుండా వెళుతున్న కాలువల్లో, వాగుల్లో విద్యుత్తు మోటార్లు అమర్చి ఒడ్డున స్టార్టర్ బాక్సు అమర్చుకొని విద్యుత్తు తీగలతో అనుసంధానించి నీటిని పారిస్తున్నారు. తరచూ మోటార్లకు అమర్చిన తీగలు అపహరణకు గురవుతున్నాయి.

అర్ధరాత్రి వేళ అపహరణ..

కాలువల వెంబడి ఉన్న వ్యవసాయ పంపుసెట్ల వద్ద అర్ధరాత్రి దొంగలు అపహరణకు పాల్పడుతున్నారు. అర్ధరాత్రి సంచారం తక్కువగా ఉండడం, సులువుగా తప్పించుకునే అవకాశం ఉండడంతో అదను చూసి తీగలను కత్తిరించి ఎత్తుకెళుతున్నారు. ఒకేసారి వరసగా ఉన్న ఇరవై, ముప్పై మోటార్ల తీగలను కత్తిరించుకుని వెళుతున్నారు. అందులోని రాగి తీగను వేరు చేసి దానిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. గతంలో వెల్లుల్ల, ఆత్మకూర్‌తో పాటు జిల్లాలోని పలు గ్రామాల్లో ఇదే తరహా ఘటనలు జరిగాయి. ఇవే కాకుండా చిన్న విద్యుత్తు నియంత్రికలను సైతం పగులగొట్టి రాగి తీగ ఎత్తుకెళ్లడంతో పాటు విద్యుత్తు నియంత్రిక మరమ్మతు కేంద్రంలో కూడా చోరీ చేసిన సందర్భాలు ఉన్నాయి.

గతంలో మెట్‌పల్లి డివిజన్ పరిధిలో పోలీసులు రాగి తీగ దొంగలను పట్టుకున్నారు. అయినా అదను చూసి దొంగలు అన్నదాతల వ్యవసాయ మోటార్లపై నజర్ పెట్టి తీగలు అపహరించుకుపోతున్నారు. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ విషయమై మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డిని సంప్రదించగా, మెట్‌పల్లి సర్కిల్ పరిధిలో కాలువల వెంబడి గస్తీ పెంచుతామని, ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే రైతులు వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని తెలిపారు.

## చెత్త సమస్యకు పరిష్కారం

కరీంనగర్ : నగరాలు, పట్టణాల్లో గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త నిల్వలతో డంపింగ్‌యార్డులు నిండిపోతున్నాయి. ప్రతి రోజు వచ్చే చెత్త ఎక్కడ వేయాలో తెలియని గందరగోళం నెలకొని ఉండగా.. కొత్తగా స్థలాలు సేకరించినా ఆయా ప్రాంతవాసుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఉన్న చెత్తను తగ్గించడంతోపాటు నిల్వ ఉన్న వ్యర్థాలను శుద్ధి చేసేందుకు వీలుగా చెత్తతో విద్యుత్తు ఉత్పత్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరీంనగర్, రామగుండం నగరపాలికలతోపాటు పురపాలికల్లో చెత్త సేకరణ సవాల్‌గా మారింది. సేకరిస్తున్న చెత్తలో తడి, పొడి వేరు చేస్తుండగా పొడి చెత్త 90 శాతం వస్తుండటంతో దీనిని డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. ఎక్కడ చూసిన నిల్వలు పెరిగిపోతుండగా ఎండాకాలంలో మంటలు వ్యాపిస్తుండటం, వాసన భరించలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్తగా స్థలాలు సేకరించడం సాధ్యం కాకపోవడంతో చెత్తతోనే విద్యుత్తు తయారీకి రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే ఎంతమేర చెత్త ఉత్పత్తి అవుతుందనే వివరాలను పురపాలక శాఖ వివరాలు సేకరించినట్లు తెలిసింది.

వరంగల్-కరీంనగర్ మధ్య ఉండే హుజూరాబాద్‌లో విద్యుత్తు ఉత్పతి ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు జిల్లా పాలనాధికారి స్థల సేకరణ సేకరించినట్లు సమాచారం. కరీంనగర్, వరంగల్ ఉమ్మడి జిల్లాల నుంచి చెత్తను తీసుకొచ్చి విద్యుత్తు తయారు చేసేలా ప్రతిపాదనలు చేశారు.

పదేళ్ల కిందట సుగ్లాంపల్లిలో..

పదేళ్ల కిందట ఉమ్మడి జిల్లాలోని సుగ్లాంపల్లిలో చెత్త ద్వారా విద్యుత్తు తయారు చేసే ప్లాంట్ నడిపించారు. కరీంనగర్, సిద్దిపేట, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల, సిరిసిల్ల, వేములవాడ, హుజూరాబాద్, జమ్మికుంట, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల నుంచి చెత్తను తీసుకొచ్చి విద్యుత్తు తయారు చేశారు.

యూనిట్ ధర అధికంగా ఉండటంతో మూతపడింది. మళ్లీ చెత్తతో విద్యుత్తు తయారీ చేయాలనే ప్రతిపాదనలు రావడంతో డంపింగ్‌యార్డులు ఖాళీ అవుతాయనే ఆలోచనలో ఉన్నారు. ప్లాంట్ ఏర్పాటు సకాలంలో జరిగితే పట్టణాలు, నగరాల్లో చెత్త సమస్యకు ముకుతాడు పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

రూ. 16 కోట్లతో బయోమైనింగ్..కరీంనగర్ నగరపాలిక పరిధిలో స్మార్ట్‌సిటీ నిధులు రూ. 16 కోట్లతో బయోమైనింగ్ ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఏడాదిన్నర కిందట ప్రారంభించిన ఈ పనులతో 2.50 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తలో కేవలం 80 వేల మె.ట చెత్త మాత్రమే ప్రాసెసింగ్ చేశారు. ఓ వైపు శుద్ధి చేస్తుండగా.. మరో వైపు చెత్త తీసుకొచ్చి పోస్తుండటంతో వ్యర్థాలు ఎంతమేర తగ్గిందనేది తెలియకుండా మారుతుంది.

# వార్డుకో ఉద్యానం

వికారాబాద్ : ఇంటి సమీపంలో ఆహ్లాదకరమైన వాతావరణంతో ఒక్క పార్కు అయినా ఉంటే ఎంతో మేలు అని అనుకోవడం సర్వసాధారణం. వీరిక వేళల్లో అక్కడికి వెళ్లి కాలక్షేపం చేయాలని, తమ పిల్లల్ని ఆడించాలని తల్లిదండ్రులు, మనుమలు, మనుమరాళ్లను తీసుకెళ్లాలని తాతలు భావిస్తుంటారు. ప్రజల కోరిక మేరకు వికారాబాద్ పట్టణంలో పార్కుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు. వార్డుకో ఉద్యానం చొప్పున ఏర్పాటు చేయాలన్నదే పాలకవర్గం లక్ష్యం. ఆ దిశగా చర్యలు చేపడుతున్నారు. వికారాబాద్ పట్టణ ప్రస్తుత జనాభా అధికారికంగా 65 వేలు. 34 వార్డులున్నాయి. ఒకప్పుడు ఒక్క గాంధీ పార్కు మాత్రమే ఉండేది. దీనిని 60 ఏళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ప్రతి వార్డుకు ఒక ఉద్యానాన్ని అభివృద్ధి చేస్తున్నారు. పట్టణంలో 100 వరకు ఖాళీ స్థలాలున్నాయి. అవసరం మేరకు నిధులు మంజూరు చేస్తూ పనులు చేపడుతున్నారు. దీంతో వార్డుల ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం, ఆడిపించడం కోసం పార్కులకు తీసుకొస్తు న్నారు. ప్రజలకు అందుబాటులోకి..



ఇటీవల కాలంలో సాకేత్‌నగర్, చౌదరి, బీటీఎస్, శివరాంనగర్ కాలనీల్లో పార్కులను వినియోగంలోకి తెచ్చారు. సాకేత్‌నగర్‌లో పిల్లలు ఆడుకోవటానికి క్రీడా పరికరాలు, పెద్దలు వ్యాయామం చేయడానికి వ్యాయామ పరికరాలను అమర్చారు. చౌదరి, బీటీఎస్, శివరాంనగర్ కాలనీల్లో క్రీడా పరికరాలు, వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు. ఎల్ఐజీ కాలనీలో ప్రహరీ నిర్మించారు. క్రీడా పరికరాలు వినియోగంలోకి తెచ్చారు. మొక్కలు నాటి అభివృద్ధి చేస్తున్నారు. మరుతీనగర్, గిరిగిట్ పల్లి, రామయ్యగూడ, గరీబ్‌నగర్, ఎల్ఐజీ కాలనీల్లో ఖాళీ స్థలాల్లో ప్రహరీలను నిర్మించారు. బీటీఎస్, చౌదరికాలనీల్లో రూ.14 లక్షల వ్యయం చేశారు. పట్టణంలోని ఖాళీ స్థలాలను ఉద్యానాల్లా అభివృద్ధి చేస్తున్నామని పుర అధ్యక్షురాలు మంజుల తెలిపారు.

# ఖమ్మంలో వేగం.. భద్రాద్రిలో మందగమనం

కొత్తగూడెం : ప్లాట్లు, లేఅవుట్ అనుమతి లేని స్థలాలను క్రమబద్ధీకరించేందుకు భారాస ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అవకాశం కల్పించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. క్రమబద్ధీకరణ చేపట్టే క్రమంలో తలెత్తిన వివిధ సమస్యల వల్ల ప్రక్రియ నిలిచిపోయిన విషయం విదితమే. గతేడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఎల్ఆర్ఎస్ అంశాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. అక్రమాలకు తావులేకుండా ఎల్ఆర్ఎస్ ప్రక్రియను మూడు నెలల్లో పూర్తిచేయాలని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది ఆగస్టులో కలెక్టర్లను ఆదేశించారు. అధికారులు పరిశీలన ప్రక్రియలో నిమగ్నమైనా ఆశించిన స్థాయిలో పురోగతి కనిపించటం లేదు. ఉభయ జిల్లాల్లో.. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ఖమ్మం జిల్లాలో జోరందుకోగా.. భద్రాద్రి జిల్లాలో మందగమనంగా సాగుతోంది. ఖమ్మం కార్పొరేషన్, మున్సిపాలిటీలు, సుడా, గ్రామపంచాయతీల వారీగా మొత్తం 98,270 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ప్రస్తుతం సుమారు 7,500 దరఖాస్తులు మాత్రమే అధికారుల పరిశీలనలో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలోని కొత్తగూడెం, పాల్వంచ, ఇల్లెందు పురపాలికల పరిధిలో 9,461 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 3,328 దరఖాస్తులను అధికారులు పరిశీలించారు. 419 దరఖాస్తులకు అనుమతులివ్వగా 331 దరఖాస్తులను తిరస్కరించారు. 6,133 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వచ్చిన వాటిలో 8,779 దరఖాస్తులు పాల్వంచ పురపాలికకు చెందినవి కావటమే గమనార్హం.

మూడు శాఖల సమన్వయంతో..

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ పురపాలిక, నీటిపారుదల, రెవెన్యూ శాఖల సమన్వయంతో సాగుతోంది. గతంలో మూడు శాఖలకు సంబంధించిన అధికారులు ఒక్కొక్కరు ఒక్కోసారి పరిశీలనకు వెళ్లేవారు. ప్రస్తుతం మూడు శాఖల అధికారుల ఒకేసారి



వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. లేఅవుట్లు, ప్లాట్లు శిఖం భూమిలో లేనట్లు నీటిపారుదలశాఖ అధికారులు ఇచ్చే ఎన్‌ఓసీ (నిరభ్యంతర ప్రతం) జారీలో జాప్యం జరుగుతోందని యంత్రాంగం చెబుతోంది. అందుకే దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ నెమ్మదిగా సాగుతోంది.

ఆసక్తి చూపని దరఖాస్తుదారులు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు దరఖాస్తుదారులెవరూ ఆసక్తి చూపటం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీనికి తోడు ఎల్ఆర్ఎస్ యాప్ మొరాయిస్తుండటం కూడా భద్రాద్రి జిల్లాలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ వేగంగా సాగకపోవటానికి కారణమంటున్నారు. దరఖాస్తు సమయంలో ధ్రువపత్రాలు సరిగ్గా సమర్పించని దరఖాస్తుదారులకు ఉన్నతాధికారుల ఆదేశాలతో మరోసారి అవకాశం ఇచ్చామని తెలిపారు. రోజుకు 20 మంది దరఖాస్తుదారులకు సమాచారమిస్తే కేవలం ఒకరిద్దరు మాత్రమే లేఅవుట్, ప్లాట్ పరిశీలనకు వస్తున్నారని చెబుతున్నారు.

పాల్వంచ పురపాలిక పరిధిలోనే అత్యధికంగా ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 2,500కుపైగా దరఖాస్తులకు సరైన ధ్రువపత్రాలు లేకపోవటంతో దరఖాస్తుదారులకు మరోసారి అవకాశం కల్పించాం. దరఖాస్తుల ప్రక్రియను సకాలంలో పూర్తిచేయడానికి అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ దరఖాస్తుదారుల నుంచి స్పందన రావటం లేదు.

ఢాకునాయక్, పుర కమిషనర్, పాల్వంచ

# సంతాన భాగ్యం.. కల సాఫల్యం



హైదరాబాద్: గాంధీ ఆసుపత్రిలో సంతాన సాఫల్య కేంద్రంలో పూర్తిస్థాయి వైద్య సేవల్ని అందించేందుకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పెళ్లై ఏళ్లు గడిచినా పిల్లలు పుట్టకపోవడంతో ఎంతోమంది దంపతులు కార్పొరేట్, ప్రైవేటు సెంటర్ల చుట్టూ తిరుగుతూ రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. ఇది పేద, మధ్యతరగతి వారికి తలకుమించిన భారమే. ఇలాంటి వారికి ఊరట కలిగిస్తూ.. పైసా ఖర్చు లేకుండా సంతాన సాఫల్యం కల్పించేందుకు సర్కారు గాంధీ ఆసుపత్రిలో ఇన్ విట్రో ఫెర్టిలిటీ (ఐవీఎఫ్) కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురానుంది. మంత్రి ఆదేశాలతో.. ఇటీవల గాంధీ ఆసుపత్రిని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సందర్శించారు. ఈసందర్భంగా కేంద్రం ఏర్పాటుకు నిధులు మంజూరైన విషయాన్ని తెలుసుకొని త్వరగా అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. సాకారం కానున్న ఐదేళ్ల కల... గాంధీలో 2018లో సంతాన సాఫల్య కేంద్రం ఏర్పాటు చేశారు. కోవిడ్ కారణంగా ఈ ఆసుపత్రిని నోడల్ సెంటర్‌గా మార్చడంతో ఫెర్టిలిటీ సేవలు నిలిచిపోయాయి. కరోనా అనంతరం 2021 సెప్టెంబరులో తిరిగి పున్ణప్రారంభించారు. 2022 జనవరిలో పలు రకాల వసతులు కల్పించి ఇంట్రా యుటెరిన్ ఇన్‌సెమినేషన్(ఐయూఐ) అందుబాటులోకి తెచ్చారు. ప్రతి నెల సుమారు 800 మందికి వైద్యసేవలు అందించి 40శాతం ఫలితాలు సాధించారు. ఈ నేపథ్యంలో 200 పడకల మదర్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్) సూపర్ స్పెషాలిటీ సెంటర్ అందుబాటులోకి రావడం, మంత్రి ఆదేశాలు జారీ చేయడంతో ఐవీఎఫ్ కేంద్రాన్ని మరింత పటిష్టం చేసేందుకు తగిన నిధులు కేటాయించి, అన్ని హంగులతో తీర్చిదిద్దుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా.. గాంధీ ఎంసీహెచ్ భవనంలో ఏర్పాటు చేసిన ఐవీఎఫ్ సెంటర్‌ను అధునాతన పరికరాలు, సౌకర్యవంతమైన వసతులతో కార్పొరేట్‌కు దీటుగా రూపొందించారు. ఎంబ్రియాలజీ ల్యాబ్, ఐవీఎఫ్ ఆపరేషన్ థియేటర్, ఆండ్రాలజీ ల్యాబ్‌లు, ఫలదీకరణ చేసేందుకు ఆధునిక ఎక్విప్‌మెంట్, సెమన్ ఎనాలసిస్ యంత్రాలు, రీఏజెంట్స్ డయాగ్నోస్టిక్ హిస్టరీ లేపరోస్కోపీ, అల్ట్రాసౌండ్, కంట్రోల్ వేరియంట్, హైపర్ స్టిమిలేషన్ (సీఓఏ)లను సమకూర్చుతున్నారు. ఐవీఎఫ్‌లో ఎంబ్రియాలజీ ప్రక్రియ అత్యంత కీలకమని వైద్యనిపుణులు తెలిపారు. అన్నిరకాల సేవలు ఉచితం – రాజకుమారి, గాంధీ సూపరింటెండెంట్ సంతానంలేని దంపతులు పిల్లల కోసం రూ.లక్షలు ఖర్చు చేస్తుంటారు. ఇక్కడి ఐవీఎఫ్ సెంటర్‌లో అన్ని రకాల వైద్యసేవలు ఉచితంగా పొందవచ్చు. మందులు, స్కానింగ్ ఇతర వైద్యపరీక్షలు, సేవల కోసం పైసా ఖర్చు చేసే అవసరం లేదు. త్వరలోనే ఐవీఎఫ్ సేవలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తాం.

# కదలని 'చెత్త'వాహనాలు




హైదరాబాద్: నగరంలో చెత్త వాహనాలు సరిగా పనిచేయట్లేదు. రోజూ ఉదయాన్నే వ్యర్థాలను తొలగించాల్సిన వాహనాలు రెండు, మూడు రోజులకోసారి వస్తున్నాయి. ఆ వాహనాలకు రవాణా విభాగం సహాయ ఇంజినీర్లు నిత్యం డీజిల్ కూపన్లు ఇస్తున్నారు. రెండు, మూడు వారాలకోసారి బ్రేక్‌డౌన్ పేరుతో మరమ్మతులు చేసినట్లు బిల్లులు పెడుతున్నారు. ఇప్పటివరకు ఒక్కో వాహనానికి చేసిన మరమ్మతుల ఖర్చుతో కొత్త వాహనాన్ని కొనుగోలు చేయొచ్చని అధికారులే అంటున్నారు. ఏళ్లుగా జరుగుతోన్న ఈ దందా ఇటీవల మరింత పెరిగింది. నగర పారిశుద్ధ్యాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారనే విమర్శలున్నాయి.

35 వాహనాల్లో 90 శాతం

ఐదు నుంచి పది వీధుల్లోని చెత్త కుప్పలను తొలగించేందుకు జీహెచ్ఎంసీ రవాణా విభాగం 2016లో 35 రెఫ్యూజ్ కంపాక్టర్ వాహనాలను(ఆర్ఎఫ్‌సీ) కొనుగోలు చేసింది. మొదట్లో ఆయా వాహనాలు పక్కాగా పనిచేశాయి. కంటైనర్ లాంటి ట్రాలీలో వ్యర్థాలను ఎక్కువ మొత్తంలో నింపడం వాటి ప్రత్యేకత. తద్వారా ఒకేసారి ఎక్కువ వీధులను శుభ్రం చేయొచ్చనే ఉద్దేశంతో అధికారులు వాటిని సమకూర్చుకున్నారు. ఇప్పుడు వాటిలోని 90శాతం వాహనాలు రోజువారీ విధుల్లో పాల్గనట్లేదు. రెండేళ్లుగా వాహనాల డ్రైవర్లు నరకం చూపిస్తున్నారని, మాట వినడం లేదని సర్కిళ్ల పారిశుద్ధ్య విభాగం అధికారులు నిత్యం కేంద్ర కార్యాలయానికి ఫిర్యాదు చేస్తున్నారు.

విధులు సరిగా నిర్వర్తించట్లేదనే కారణంతో.. సంబంధిత అధికారులు వాటికి కేటాయించిన చెత్త కుప్పలను తగ్గించారు. అంబర్‌పేట, ముషీరాబాద్, సికింద్రాబాద్, తదితర సర్కిళ్లలోని 70 చెత్తకుప్పలనే వాటికి అప్పగించారు. అయినా ఫలితం కనిపించట్లేదు. అంబర్‌పేటలో 3 రోజులకోసారి వాహనాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయని, ఫోన్ చేస్తే డ్రైవర్లు స్పందించడం లేదని, విధుల్లోకి వచ్చిన రోజు సైతం అసంపూర్తిగా పని చేస్తున్నారని సర్కిల్ పారిశుద్ధ్య అధికారికు తెలిపారు. చెత్త కుప్పలను శుభ్రం చేసే బాధ్యతను ప్రైవేటు వాహనాలకు అప్పగిస్తామనే హెచ్చరికను డ్రైవర్లు ఖాతరు చేయట్లేదని, ప్రైవేటు వాహనదారులను బెదిరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

చెత్త రవాణా వాహనాలు, అధికారులు ఉపయోగించే వాహనాలకు జీహెచ్ఎంసీ ఏటా రూ.25 కోట్ల డీజిల్‌ను వినియోగిస్తోంది. మరమ్మతులకు మరో రూ.5 కోట్ల ఖర్చు. అందులో 70 శాతం నిధులు దారి మళ్లుతున్నాయనే విమర్శలున్నాయి. చెత్త రవాణా, ఇతర తనిఖీ వాహనాలకు జీపీఎస్ పరికరాలను అమర్చడం, చేయని మరమ్మతులకు బిల్లుల మంజూరు, డీజిల్ కూపన్ల మాయాజాలం ఏళ్లుగా కొనసాగుతోంది. హోటళ్ల నుంచి వ్యర్థాలను సేకరించే వాహనాలు లేవు. స్వచ్ఛ ఆటోలే ఆ పని చేస్తున్నాయి. కొన్ని హోటళ్లు వ్యర్థాలను మురుగు కాలువల్లో, చెరువుల్లో వదిలేస్తున్నాయి. చెత్తకుప్పల తొలగింపును నిర్లక్ష్యం చేస్తోన్న వాహనాలను రాత్రివేళ హోటళ్ల వ్యర్థాల సేకరణకు ఉపయోగిస్తే బాగు.

# పంటల బీమా.. ఏదీ ధీమా!



వికారాబాద్ :పరిగి మండలం నజీరాబాద్ తండాకు చెందిన దానిబాయి అనే రైతు నాలుగెకరాల పొలంలో కంది సాగు చేశారు. ఇందుకోసం రూ.40 వేలు పెట్టుబడి పెట్టాల్సి వచ్చింది. కలుపు తీత అనంతరం పైరు కళకళలాడే దశలో కురిసిన భారీ వర్షాలు పంటను దెబ్బతీశాయి. నవాబుపేటకు చెందిన శేఖర్‌రెడ్డి ఐదెకరాల్లో మూడెకరాలు ఇతర, రెండెకరాల్లో కూరగాయ పంటలు సాగు చేశారు. వర్షాలకు టమాటా, క్యాలీఫ్లవర్, క్యాబేజీ కుళ్లిపోయి రంగుమారి నష్టం జరిగింది. పెట్టుబడి సైతం రావడం లేదు.

ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగితే ఆదుకునే బీమా పథకం గత మూడేళ్లుగా అమలు కావడం లేదు. కోటి ఆశలతో రైతులు ఖరీఫ్ సీజన్‌కు శ్రీకారం చుట్టినా చివరకు కష్టాలు నష్టాలే వెంటాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ధీమా లేకపోవడంతో ఆఖరుకు పెట్టిన పెట్టుబడులు కూడా అందకుండా పోతున్నాయని వాపోతున్నారు. జిల్లాలోని పరిగి, వికారాబాద్, తాండూరు, కొడంగల్ నియోజవకర్గాల్లో వానాకాలం సాధారణ సాగు 5,78,874 ఎకరాలు. వివిధ రకాల పంటలు 5,35,650 ఎకరాల్లో సాగులోకి వచ్చాయి. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజన్న, జన్న ఉన్నాయి. సీజన్ ప్రారంభ సమయంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. దీంతో 43 వేల ఎకరాలు సాగుకు నోచుకోలేదు. ప్రధానంగా వరి పంటకు అవరోధం కలిగింది.

మూడేళ్లుగా ఊసే లేదు

గతంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేసేవి. మూడేళ్లుగా దాని ఊసే లేకపోవడంతో పరిహారం అందకుండా పోతోంది. జిల్లాలోని పరిగి, మోమిన్‌పేట, ధారూర్, పెద్దేముల్, తాండూరు, కుల్కచర్ల, నవాబుపేట, యాలాల, మర్పల్లి, వికారాబాద్ మండలాల్లో సుమారు 15 వేల ఎకరాల్లో ఆయా పంటలకు నష్టం కలిగింది. ఇప్పటికైనా పంటల బీమా పథకాన్ని అమలు చేయాలని డివిజన్ రైతులు కోరుతున్నారు.

భారీ వర్షాలతో..గత నెలలో కురిసిన భారీ వర్షాలు అన్నదాతల ఆశలను తుంచేసింది. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పైర్లు ఆశాజనకంగా ఉన్న సమయంలోనే వరుణుని దెబ్బకు పరిస్థితులు తారుమారయ్యాయి. ఎక్కువగా పత్తి, మొక్కజన్న, జన్న, కంది పంటలకు నష్టం వాటిల్లింది. ఒక్కో పత్తి మొక్కకు కనీసం 40 నుంచి 50 కాయలు ఉంటేనే మంచి దిగుబడులు వస్తాయి. కానీ వీటిలో సగం కూడా లేవని రైతులు వాపోతున్నారు. మొక్కజన్నకు ఎకరాకు రూ.10వేల వరకు, పత్తికి రూ.26 వేలకు పైగా పెట్టుబడులు పెట్టాల్సి వచ్చిందని చెబుతున్నారు.

అంచనాలు పంపాం –మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి.

భారీ వర్షాల కారణంగా వివిధ మండలాల్లో 1432 ఎకరాల్లో నష్టం జరిగింది. ప్రభుత్వానికి అంచనాలు పంపాం. వాతావరణం అనుకూలించడంతో యాసంగిలో ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇచ్చే విధంగా రైతులను ప్రోత్సహిస్తున్నాం.

# లక్ష్యం.. ప్రణాళిక.. సాధన.. విజేతల గెలుపు సూత్రాలివి

పెద్దపల్లి : 'విజేతలు భిన్నమైన పనులు చేయరు.. అందరూ చేసే పనులనే వైవిధ్యంగా చేస్తారు..' అని అంటారు ప్రముఖ ఆంగ్ల రచయిత శివ్‌ఖేరా. అందరికీ ఉన్న సమయమే తమకూ ఉన్నా కొందరు దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. వేలల్లో ఒకడిగా కాకుండా, అందరిలోనూ ప్రథముడిగా నిలవాలన్న లక్ష్యంతో ఎంచుకున్న రంగంలో మేటిగా నిలుస్తున్నారు.

వారంతా లక్ష్యం నిర్దేశించుకొన్నారు. సాధన కోసం కఠోరంగా శ్రమించారు. పాఠ్య పుస్తకాలనే నేస్తాలుగా మలచుకున్నారు. అపజయాలనే పాఠాలుగా చేసుకున్నారు. ప్రణాళిక, లక్ష్యం, పునశ్చరణ, స్వీయ మూల్యాంకనం.. ఇవే తమ గెలుపు సూత్రాలని చెబుతున్నారు. ఇటీవలి డీఎస్సీ ఫలితాల్లో పెద్దపల్లి జిల్లా స్థాయిలో వివిధ కేటగిరీల్లో మొదటి ర్యాంకు సాధించిన అభ్యర్థులు తమ సన్నద్ధత తీరును 'న్యూస్‌టుడే'తో పంచుకున్నారు.

ప్రతి పాఠానికీ స్వీయ పరీక్ష

ఉన్నది ఒకే పోస్టు, ప్రతి రోజూ రేపే ఫైనల్ పరీక్ష ఉన్నట్లు భావించా. ఉద్యోగానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి ఎలాగైనా సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నా. ఏరోజూ సమయాన్ని వృథా చేయలేదు. అవసర మైన ప్రణాళిక వేసుకొని సన్నద్ధమయ్యా. ఒక్కో రోజు రెండు, మూడు గంటలే నిద్రపోయాను. ఆన్‌లైన్‌లో పాఠాలు విన్నా. ప్రతి పాఠానికి స్వీయ పరీక్ష పెట్టుకొని తప్పులు లేకుండా సాధన చేశా. సబ్జెక్టుకు సంబంధించిన అంశాలపై మిత్రులతో చర్చించా. క్వశ్చన్ బ్యాంకు జోలికి వెళ్లలేదు. సాధన, పునశ్చరణతోనే మంచి ఫలితం వస్తుందని నమ్మాను. రెండు నెలల కిందట గురుకులంలో పీజీటీగా విధుల్లో చేరా. భర్త శ్రీనివాస్ సహకారంతోనే రెండు కొలువులు సాధించగలిగా.

సుభద్ర, స్కూల్ అసిస్టెంట్ ఆంగ్లం, భద్రిపల్లి, అంతర్గాం మండలం

ఓటమి నేర్పిన విషయాలెన్నో..

ఓటమి నా జీవితాన్ని మలుపు తిప్పంది. గతంలో ఒకసారి డీఎస్సీ, మూడు సార్లు గురుకుల ఉపాధ్యాయ పరీక్ష రాసినా ఎంపిక కాలేదు. అయినా నిరాశ చెందలేదు. మానసిక ఒత్తిడికి గురి కాలేదు. ఈసారి రోజుకు 10 గంటల పాటు సన్నద్ధమయ్యా. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు తెలుగు పాఠ్యపుస్తకాలను క్షుణ్ణంగా చదివా. అందులోని సాహిత్యంపై పట్టు పెంచుకున్నా. ప్రతి పాఠానికీ నోట్స్ సిద్ధం చేసుకొని కఠినమైన అంశాలను గుర్తుంచుకునేలా సాధన చేశా. అర్థం కాని విషయాలపై ఆన్‌లైన్‌లో శోధించి సందేహాలు నివృత్తి చేసుకున్నా. సైకాలజీ, మెథడాలజీని అర్థం చేసుకున్నా. కవులు, సాహితీవేత్తలకే పరిమితం కాకుండా కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జిపై దృష్టి పెంచాలి.

కృష్ణ వేముల, స్కూల్ అసిస్టెంట్ తెలుగు, గోదావరిఖని

అర మార్కు మలుపు తిప్పింది

గత డీఎస్సీలో అర మార్కుతో ఉద్యోగం దూరమవడం నా జీవితాన్ని కీలక మలుపు తిప్పింది. వచ్చేసారి ఎలాగైనా సాధించాలని అప్పుడే నిర్ణయించుకున్నా. పొరపాట్లు సరిదిద్దుకున్నా. పట్టుదలతో సన్నద్ధమయ్యా. పగలు మొత్తం జిల్లా గ్రంథాలయంలోనే గడిపా. కీలక అంశాలు, సమాచారంపై స్నేహితులతో కూలంకుశంగా చర్చించా. ప్రతి అంశాన్ని రాసుకున్నా. పోటీ పరీక్ష అంటే మొదట భయం వీడాలి. ఇన్నాళ్లూ చదివిన అంశాలపై తడబడకుండా పరీక్ష రాయాలి. కుటుంబ సభ్యుల సహకారంతో కొలువు సాధించా.

నీరటి శ్రీనివాస్, ఎస్జీటీ, కదంబాపూర్, సుల్తానాబాద్ మండలం

మూడు సార్లు స్వల్ప మార్కులతో దూరం

గతంలో మూడు సార్లు వివిధ ఉద్యోగ పోటీ పరీక్షలకు హాజరైనా స్వల్ప మార్కులతో ఉద్యోగాలు కోల్పోయా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని మరింత పట్టుదల, క్రమశిక్షణ, ఏకాగ్రతతో సన్నద్ధమయ్యా. రోజుకు 6 గంటల పాటు కఠిన సాధన చేశా. గ్రంథాలయానికి వెళ్లి సిద్ధమయ్యా. 6 నుంచి 12వ తరగతి వరకు పుస్తకాల్లోని ప్రతి అంశాన్నీ రాసుకున్నా. వివిధ పబ్లికేషన్లకు సంబంధించిన పుస్తకాలు చదివా. రేఖాగణితం, క్షేత్రమితి, సంఖ్యామానం, త్రికోణమితిలపై పట్టు పెంచుకునే భావనలను గుర్తుంచుకున్నా. సొంతంగా నోట్స్ సిద్ధం చేసుకున్నా.లట్ట శ్రీనివాస్, స్కూల్ అసిస్టెంట్ గణితం, గోపాల్‌పూర్, మంథని మండలం

ఒక్క పోస్టున్నా నాదే కావాలనుకున్నా

బయోసైన్స్‌లో ఒక్క పోస్టున్నా మొదటి ర్యాంకుతో అది నాదే కావాలి.. అని లక్ష్యంగా పెట్టుకొని చదివా. గతంలో ఒకసారి డీఎస్సీ రాసినా ఉద్యోగం రాకపోవడంతో కొంత నిరాశకు గురయ్యా. ఓటమి నుంచి గుణపాఠం నేర్చుకొని క్రమశిక్షణ, ప్రణాళికతో సన్నద్ధమయ్యా. పట్టు వదలకుండా రోజుకు 12 గంటల పాటు శ్రమించా. కంటెంట్, మెథడాలజీ, విద్యా దృక్పథాలు, సైకాలజీపై ఎక్కువగా దృష్టి పెట్టా. 6 నుంచి 12వ తరగతి వరకు పాఠ్యపుస్తకాల్లో లైన్ టు లైన్ చదువుతూ నోట్స్ రాసుకున్నా. ప్రతి పాఠానికి సొంతంగా పరీక్ష పెట్టుకొని తప్పులు దిద్దుకున్నా. భర్త మునీంద్ర, మా అమ్మ రీనాకుమారి ప్రోత్సాహంతో లక్ష్యం సాధించా.

గదదాస్ ప్రణీత, స్కూల్ అసిస్టెంట్ బయోసైన్స్, రామగుండం

పాఠ్యాంశాలను జీవితానికి అన్వయించుకున్నా

గతంలో రెండు సార్లు డీఎస్సీ రాసినా నిరాశే ఎదురైంది. అప్పుడు చేసిన పొరపాట్లను మననం చేసుకొని వాటినే సవాళ్లుగా తీసుకున్నా. ప్రయత్న లోపాలు తెలుసుకున్నా. క్రమశిక్షణగా రోజుకు 12 గంటల పాటు సన్నద్ధమయ్యా. పాఠ్యపుస్తకాలు, దినపత్రికల్లో వచ్చే సమాచారా న్ని క్రమం తప్పకుండా అనుసరించా. బట్టీ పట్టే విధానం కాకుండా పాఠ్యపుస్తకాల్లోని అంశాలను నిత్య జీవితానికి అన్వయించుకున్నా. సీసీఈ(నిరంతర సమగ్ర మూల్యాంకనం) విధానంలో కొంత సమాచా రం అందుబాటులో ఉండదు. అందుకే పాత పుస్తకాల్లోని అంశాలను క్రోడీకరించి నోట్స్ సిద్ధం చేసుకున్నా. వీటినన్నీ ఎక్కువ సార్లు మననం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఫిజిక్స్ అనే ఫోబియాను మనసులో తొలగించుకొని సాధన చేస్తే మిగతా సబ్జెక్టుల కంటే ఇది చాలా సులువు.శీలం దేవేందర్, స్కూల్ అసిస్టెంట్, భౌతికశాస్త్రం, వెక్లాస్‌పూర్, మంథని మండలం

# ప్రతిపాదనలతో సరిపెడతారా?

కొత్తగూడెం : దశాబ్దాల క్రితం నిర్మించిన కొత్తగూడెం ప్రయాణ ప్రాంగణం దశ మారుతుందనే ఆశలు చిగురిస్తున్నాయి. అసౌకర్యాలు తిష్ఠ వేయడంతో ఇక్కడికి వచ్చే ప్రయాణికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. డిపో కార్మికులు సైతం నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండులో మరుగుదొడ్లు కనీసం సౌకర్యవంతంగా లేకపోవడం బాధాకరం. ఓ వైపు ఏళ్లనాటి ప్రధాన భవనం వర్షాలకు కురుస్తోంది. ఈ క్రమంలో నూతన భవనం నిర్మించాలనే ప్రతిపాదనలు తెరకెక్కుతున్నాయి. ఇవి కార్యరూపం దాల్చాలన్నది ప్రయాణికుల కోరిక.కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఇటీవల బస్టాండును ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్టాండు భవనానికి మరమ్మతులు చేసుకుంటూ పోతే నిధులు వృథా తప్ప ఉపయోగం ఉండదని భావించారు. నూతన భవన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆర్టీసీ సివిల్ అధికారులతో నేరుగా మాట్లాడారు. సెప్టెంబర్ 18న ప్రయాణ ప్రాంగణాన్ని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ పరిశీలించారు. బస్టాండు భవనం పునరుద్ధరణతో పాటు ఆవరణలో పార్కు, ఇతర అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తామన్నారు. నేపథ్యంలో బస్టాండు దశ మారుతుందా..? అనే ఆశలు చిగురించాయి. జిల్లా కేంద్రంలో బస్టాండును నూతనంగా నిర్మించి అభివృద్ధి చేస్తే ప్రయాణికుల సమస్యలు సమసిపోతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రోజుకు 20వేల మందికిపైగా రాకపోకలునిత్యం 20 వేల మందికి పైగా ప్రయాణికులు 'గూడెం' నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. దాదాపు రూ.15 లక్షల వరకు రోజువారీ ఆదాయం లభిస్తోంది. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి వందల సంఖ్యలో సర్వీసులు వస్తుండటంతో బస్టాండు కళకళలాడుతుంది. కానీ నిర్వహణ సరిగా లేక పరిసరాలు కళావిహీనంగా మారుతున్నాయి. వర్షం వస్తే భవనం అంతా కురుస్తోంది. మరుగుదొడ్లు ఏ మూలకు చాలడం లేదు.

# రైతు రుణ సమస్యకు భరోసా

వికారాబాద్ : రుణమాఫీకి అన్ని అర్హతలు ఉన్నా పలు కారణాల వల్ల మాఫీ కాక రైతులు అధికారుల కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇలాంటి రైతుల కోసం 'రైతు భరోసా' 'రుణమాఫీ' యాప్‌ను ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా రైతన్నలకు ఊరట కలుగుతుందని అధికారులు వెల్లడిస్తున్నారు. సంబంధించికథనం

ఇప్పటివరకు 6,000 దరఖాస్తులు

ప్రభుత్వం వివిధ దశల్లో రూ.2 లక్షల వరకు మాఫీ చేసింది. కొంతమందికి ఇప్పటి వరకు మాఫీ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నారు. వీరు మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇలా ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రైతుల నుంచి దాదాపు 6,000 దరఖాస్తులు వచ్చాయి. వీరు కలెక్టరేట్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ సమస్యల పరిష్కరించాలని తిరుగుతున్నారు.

అధికారులకు శిక్షణ ఇచ్చారు



మాఫీ వర్తించని వారి ఇళ్లకు అధికారులు వెళ్లి క్షేత్ర స్థాయిలో సమాచారం తెలుసుకుని యాప్‌లో నమోదు చేయాలని ప్రభుత్వం ఉన్నతాధికారులకు మార్గదర్శకాలు జారీ చేసింది. రుణమాఫీ యాప్‌పై అధికారులకు శిక్షణ కూడా ఇచ్చారు. యాప్‌లో మండల వ్యవసాయాధికారులు మాత్రమే లాగిన్ చేయాల్సి ఉంటుంది. పంట రుణం ఆప్షన్‌లోకి వెళ్లి దరఖాస్తుదారు తీసుకున్న బ్యాంక్ పేరు, బ్రాంచి వివరాలు పొందుపర్చగానే సదరు బ్యాంకులో ఉన్న రైతుల వివరాలు వస్తాయి. దరఖాస్తుదారు ఆధార్ సంఖ్యను నమోదు చేయాలి. అనంతరం కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను నమోదు చేయాలి. చివరకు వ్యవసాయాధికారి కుటుంబ సభ్యులతో సెల్ఫీ దిగి యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. అనంతరం దరఖాస్తుదారు నుంచి ధ్రువీకరణ పత్రం (పంచాయతీ కార్యదర్శి లేదా ప్రభుత్వ ఉద్యోగి ద్వారా పొందిన) తీసుకుంటారు.కుటుంబ సభ్యుల నిర్ధరణ కోసం

రుణమాఫీ కాని రైతుల కోసం ఏర్పాటు చేసిన యాప్‌ను ప్రస్తుతానికి కుటుంబ సభ్యుల నిర్ధరణ కోసమే వినియోగించనున్నాం. రుణ మాఫీ కాలేదని చెబుతున్న రైతుల నుంచి మండల స్థాయిలో దరఖాస్తులను స్వీకరిస్తున్నాం. రైతులకు అన్ని విధాలా న్యాయం చేకూర్చే విధంగా చర్యలు తీసుకుంటాం.

ఎన్.మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి, వికారాబాద్

# కష్టాల కడలిలో నేతన్న

దుబ్బాక: ప్రతి ఒక్కరికి కూడు, గూడు, వస్త్రం ఎంతో అవసరం. దేశంలో వ్యవసాయం తర్వాత చేనేతకు అత్యంత ప్రాధాన్యం ఉండేది. కానీ ఇప్పుడది మారింది. మరమగ్గాల రాకతో చేనేత రంగం కుదేలవుతోంది. చేనేతకు ప్రసిద్ధి చెందిన సిద్దిపేట జిల్లా దుబ్బాకలో ఇప్పటికీ కొందరు ఈ వృత్తిలోనే కొనసాగుతున్నారు. ఒకప్పుడు కళకళలాడగా, ఈ రంగంలోని ఎంతోమంది ఉపాధి కరవై వలస వెళ్లడంతో కళావిహీనమైంది.

దుబ్బాకలో 1947లో చేనేత సహకార సొసైటీ 200 మంది సభ్యులతో ఏర్పడింది. ప్రస్తుతం 1734 మంది కొనసాగుతున్నారు. సభ్యుల సంఖ్య పెరిగినా నేత పని చేస్తున్న వారు మాత్రం స్వల్పమే. గతంలో 700 మందికి పైగా చేనేత కార్మికులు వస్త్రాలు నేయగా, ఇప్పుడు 100లోపే ఉండటం గమనార్హం. 2020లో సంఘం పాలకవర్గంపై పలు ఆరోపణలు రాగా, ప్రభుత్వం విచారించి రద్దు చేసింది. ఆ తర్వాత ఒక ప్రభుత్వ అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించారు.

అరకొర వేతనాలతో..

ప్రస్తుతం 40 మగ్గాలపై 50 మంది కార్మికులు చాలీచాలని వేతనాలతో పలు ఆకృతుల్లో చేనేత దుస్తులు తయారుచేస్తున్నారు. నేషనల్ హ్యాండ్లూమ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ప్రతి మూడు నెలలకోసారి 2 నుంచి 3 క్వింటాళ్ల నూలు కొనుగోలు చేస్తున్నారు. జరీ చీరలు, షర్టులు, తువాళ్లు, లెనిన్ కాటన్ చీరలు, దుప్పట్లు తయారు చేస్తున్నారు. వాటిని రాష్ట్ర చేనేత సహకార సంఘం(టెస్కో)కు విక్రయిస్తూ ఉపాధి పొందుతున్నారు. ఇటీవల జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు దిల్లీలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మెడలో వేసిన నూలు లడీల దండను ఇక్కడి వారే రూపొందించారు. నాలుగు నెలల క్రితం రాష్ట్ర దేవాదాయ, న్యాయశాఖ మంత్రి, ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌ఛార్జి కొండా సురేఖ దుబ్బాక చేనేత సహకార సంఘాన్ని సందర్శించి, కార్మికులు నేసిన చేనేత జరీ చీరను రూ.15 వేలకు కొనుగోలు చేశారు. ఇక్కడి ఉత్పత్తులకు వివిధ ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉంది.

ఇలా చేస్తే ప్రయోజనంప్రభుత్వం తోడ్పాటు అందిస్తే, విభిన్న ఆకృతుల్లో వస్త్రాల తయారు చేసేందుకు ఇక్కడి కార్మికులు సిద్ధం. ఒకరు నెల పాటు శ్రమిస్తే రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు సంపాదిస్తున్నారు. అరకొర వేతనాలతో సతమతమవుతున్న చేనేత కార్మికులకు ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేయాలి. బీమా సౌకర్యానికి ఉన్న 59 ఏళ్ల వయోపరిమితిని ఎత్తివేయాలి. నూలుపై రాయితీ ఇవ్వడంతో పాటు అంత్యోదయ, ఆరోగ్య కార్డులు మంజూరు చేయాలని కార్మికులు విన్నవిస్తున్నారు. పింఛన్ సౌకర్యం కూడా కల్పించాలని కోరుతున్నారు.

# జైలా.. పచ్చిక బయలా!



సంగారెడ్డి : అదో కారాగారం.. అక్కడ అడుగు పెట్టగానే పచ్చందాలు స్వాగతం పలుకుతాయి. వివిధ రంగుల్లోని పూల మొక్కలు ఆహ్లాదాన్ని అందిస్తున్నాయి. ఇవన్నీ సంగారెడ్డిలోని కేంద్ర కారాగారం విశేషాలు. 2012లో అప్పటి ఖైదీలు మొక్కలు నాటి సంరక్షించడంతో అవి ఏపుగా పెరిగి పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. ఖైదీల్లో నేర ప్రవృత్తి తగ్గించేలా.. సత్ప్రవర్తనకు ప్రభుత్వం జైళ్ల శాఖలో పలు సంస్కరణలు తీసుకురాగా, ఇందులో భాగంగా మొక్కల పెంపకంపై దృష్టిసారించింది. జైలు ప్రాంగణం 40 ఎకరాల్లో విస్తరించి ఉండగా, 13 ఎకరాల్లో పలు భవనాలు నిర్మించారు. మిగతా దాంట్లో మామిడి, అల్ల నేరేడు, జామ తోటలు, టేకు వనం పెంచుతున్నారు. కూరగాయ లనూ పండిస్తున్నారు. నిత్యం 20 మంది ఖైదీలు, ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షిస్తుంటారని జైలు పర్యవేక్షకుడు భరత్ రెడ్డి తెలిపారు. ప్రస్తుతం 590 మంది ఖైదీలున్నారు.

# రక్షణ లేక చెరువుల భక్షణ



కరీంనగర్ : ఇదీ.. కరీంనగర్-చొప్పదండి రోడ్డు పక్కనే ఆరెపల్లి శివారులోని ఊరకుంట. గతంలో అధికారులు గూగుల్ ఎర్త్ మ్యాప్ ద్వారా గుర్తించిన ఎఫ్‌టీఎల్ పరిధి ఇది. 8.2 ఎకరాలున్న ఈ నీటి వనరు కాలక్రమంగా కుంచించుకుపోయింది. అక్రమ నిర్మాణాలతో రూపు కోల్పోతోంది. 2015లో మిషన్ కాకతీయ పనులు చేపట్టేందుకు రూ.14.56 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఇక్కడి తూముకు అప్పట్లో మరమ్మతు చేశారు. స్థిరాస్తి జోరు పెరగడంతో ఇక్కడి విలువైన భూమిపై కన్నేసిన కొందరు అందినకాడికి ఆక్రమించుకునే పనిలో ఉన్నారు.

విషయం : చెరువులు, కుంటల పరిరక్షణ

ఏం జరిగింది : జిల్లాలో చాలా చోట్ల చెరువు, కుంటల శిఖం స్థలాలు కనుమరుగయ్యాయి. హద్దులు చెరిగిపోయాయి. నిర్మాణాలు వెలిశాయి.

అధికారుల పాత్ర : ఎప్పటిలాగే ఇప్పటికీ వీటి సంరక్షణ పరంగా కఠినమైన చర్యలు తీసుకోలేదు. వారి చోద్యం ఫలితంగా ఎక్కడికక్కడే ఎఫ్‌టీఎల్(నీటి నిల్వ స్థాయి) పరిధి ప్రదేశాలు ఆక్రమణలకు గురయ్యాయి. కోట్లాది రూపాయల విలువైన జాగలు ఇతరుల పరమయ్యాయి.

తక్షణ కర్తవ్యం : ప్రస్తుతం హైదరాబాద్‌లో జలవనరుల చుట్టూ ఆక్రమణలపై ఉక్కుపాదాన్ని మోపుతున్న హైడ్రా తరహాలోనే మనకూ కుడ్రా (కరీంనగర్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్) ఏర్పాటవ్వాలి. ఏళ్లతరబడి ఆక్రమణల చెరలో ఉన్న భూములకు విముక్తి కలగాలి.

ఇలా ఇష్టారాజ్యమే..

జిల్లా వ్యాప్తంగా చెరువులు కుంటలన్నీ కలిపి 1008 ఉన్నాయి. వీటన్నింటి విస్తీర్ణం 13,456 హెక్టార్లుగా రికార్డుల్లో ఉండగా.. దాదాపు సగానికిపైగా స్థలాల్లో నిర్మాణాలు జరిగాయి. ఫంక్షన్‌హాళ్లతోపాటు ఇతరత్రా భవనాలు కొన్ని వెలిశాయి.కరీంనగర్, కొత్తపల్లి, చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట పట్టణాల్లో రెండు దశాబ్దాల కిందట ఉన్న చిన్న కుంటలు మాయమయ్యాయి. కనీసం కంటి చూపునకు కూడా అక్కడ నీటి ఆనవాళ్లు లేవు. లోతట్టు ప్రాంతాలను పూడ్చి భవనాలు నిర్మించారు. కొన్ని చోట్ల రికార్డుల్లోనూ భూమార్పిడి జరిగింది.

బొమ్మకల్ సమీపంలో భూమాఫియా ఆగడాలకు చాలా చెరువులు ధ్వంసమయ్యాయి. 46.21 ఎకరాల జక్కప్ప చెరువు, 28.10 ఎకరాల గోపాల్‌చెరువు, 16.10 ఎకరాల నల్లచెరువు, 12 ఎకరాల గోదుమకుంట, 9.10 ఎకరాల రావికుంట విస్తీర్ణంలో 70 శాతం భూభాగం పరుల ఆధీనమైంది.

ఫిర్యాదులపై చర్యల్లేవు..

ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణికి కచ్చితంగా రెండు మూడు గ్రామాలకు చెందిన చెరువుల ఆక్రమణలపై ఫిర్యాదులు అందుతాయి. గ్రామస్థులు కలెక్టరేట్‌కు వచ్చి విన్నవించినా.. క్షేత్రస్థాయిలో వాస్తవాలను మాత్రం నీటి పారుదల శాఖ అధికారులు గుర్తించడంలేదు. చెరువుల పరిరక్షణకు జిల్లా కలెక్టరు అధ్యక్షతన ఉన్న కమిటీ కొన్నేళ్లుగా సరైన చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఏటా ఒకసారి చిన్ననీటి వనరుల సరిహద్దులను సంబంధిత అధికారులు గుర్తించి హద్దురాళ్లు ఏర్పాటు చేయాలి. ఎక్కడైనా ఆక్రమణలుంటే పోలీసుల సహకారంతో కూల్చివేయాలి. కానీ రాజకీయ ఒత్తిళ్లు, ఇతరత్రా కారణాలతో అధికారులు మిన్నకుంటున్నారు. ఎవరు ఏమన్నారనే ధైర్యంతో కబ్జాదారులు రెచ్చిపోతున్నారు.

పూడ్చేస్తున్నారిలా..ఇలా నిన్నటికి నిన్న తీగలగుట్టపల్లి శివారులోని బతుకమ్మకుంటను దర్జాగా కబ్జా చేస్తున్నారు. పక్కనే ఉన్న పెద్ద బండరాళ్లను ఇందులో నింపుతూ ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఒకప్పుడు దాదాపు 5 ఎకరాలకుపైగా విస్తీర్ణమున్న ఈ కుంట ఇప్పుడు ఎకరంలోపు ఉన్న స్థలం మాదిరి చిన్నగా మారిపోయింది. కట్టతోపాటు ఎఫ్‌టీఎల్ పరిధి నలువైపులా కబ్జా కోరల్లో చిక్కుకుపోయింది. నగర పరిధిలోని మాలకుంట, ఉదుతకుంట, అవుసులకుంటలకు కబ్జాగండం తప్పలేదు. వీటిపై చాలాసార్లు స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా.. సంరక్షణ దిశగా మాత్రం చర్యలు కనిపించలేదు.

# హత్తుకొంటూ.. బతుకునిస్తూ..



కరీంనగర్ : ఆగస్టు 12న ప్రభుత్వ ఆసుపత్రిలో పండంటి బాబుకు జన్మనిచ్చిన తల్లికి మనసెలా ఒప్పిందో కానీ తనకు ఆ బాబు వద్దంటూ శిశుగృహకు అప్పగించింది. ఆ బాబు ఆలనాపాలనా వారే చూసుకుంటున్నారు.కొన్ని నెలల కిందట మరో పాపను కూడా శిశు గృహలో వదిలేసి వెళ్లగా ఆమెను నిర్వాహకులు పోషిస్తుండగా 13 నెలల పాప చిరునవ్వులు చిందిస్తోంది.

ఇలా వివిధ కారణాలతో అనాథగా మారిన అభం శుభం తెలియని చిన్నారులను, పసికందులను శిశుగృహ అక్కున చేర్చుకుంటుంది. తల్లిదండ్రులను కోల్పోయి.. తాత, నాన్నమ్మ, అమ్మమ్మ సంరక్షణలో పెరుగుతున్న క్రమంలో వారిద్దరూ దూరమై పట్టించుకునే వారు కరవైన వారికి బాలసదనం ఆశ్రయం కల్పిస్తోంది. వారి చదివించి ప్రయోజకులుగా చేసే బాధ్యత తీసుకుంటుంది. వృద్ధాప్యంలో కొడుకులు, కోడళ్లు వెలివేస్తే దిక్కుతోచని పరిస్థితిలో కొందరు ఆశ్రమాల్లో చేరుతున్నారు. ఉమ్మడి జిల్లావాసులకు కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆశ్రయం కల్పిస్తున్న ప్రభుత్వ సంస్థలపై కథనం.

బాగా చదువుతున్న బాలసదనం పిల్లలు

కరీంనగర్ బాలసదనంలో పెరుగుతున్న అనాథ పిల్లలు బీటెక్, ఏఎన్‌ఎం, పాలిటెక్నిక్ కోర్సుల వంటివి కూడా చదువుతూ తమదైన ముద్ర వేసుకుంటున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తోంది. జిల్లాకు చెందిన హరిణి వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఇంజినీరింగ్ కళాశాలల్లో బీటెక్ పూర్తి చేస్తుండగా ఆమె చెల్లెలు పదోతరగతి చదువుతోంది.

సదనంలో మొత్తం 32 మంది ఉండగా 19 మంది అయిదో తరగతి వరకు చదువుతుండగా ఏడుగురు పదో తరగతి వరకు, అయిదుగురు పాలిటెక్నిక్ ఇతర కోర్సులు చదువుతున్నారు.

ఇక్కడి వారిలో కొందరిని దత్తత తీసుకుంటారని ముగ్గురు ఇటలీ, ఒకరు స్విట్జర్లాండ్ ఇటీవల వెళ్లారని సూపరింటెండెంట్ సంతోషిణి తెలిపారు. స్త్రీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలసదనంలో అందరూ ఆడపిల్లలే ఉన్నారు.

ఆశ్రయానికి సంప్రదించే నంబరు : 98495 74457

వృద్ధులు, దివ్యాంగులకు ఇదే దారి..

పిల్లలు లేని వృద్ధులు, పిల్లలు ఆదరించని తల్లిదండ్రులు, అనాథలుగా ఉన్న అంధులు వంటి వారికి వృద్ధుల, దివ్యాంగుల ప్రభుత్వ వసతిగృహం ఆశ్రయం కల్పిస్తోంది. మొత్తం 60 మందికి వసతి అవకాశం ఉండగా ప్రస్తుతం 18 మంది వృద్ధులు, 13 మంది అంధులు ఉంటున్నారు. వీరితోపాటు దివ్యాంగులు 21 మంది ఆశ్రయం పొందుతున్నారు. ఇందులో ఆశ్రయం పొందాలంటే మహిళా శిశు సంక్షేమ శాఖను ఆశ్రయించాల్సి ఉంటుంది. అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నారు.

ఆశ్రయం పొందాలంటే సంప్రదించాల్సిన నంబర్ : 94929 30728

ఆలనాపాలనా అందించేందుకు శిశుగృహ

కరీంనగర్‌లోని శిశుగృహలో ప్రస్తుతం ఏడుగులు పిల్లలు ఉన్నారు. పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్ల వారికి ఆశ్రయం కల్పించి ఆలనాపాలనా చూసుకుంటారు. వీరిలో ఇద్దరు ఆడపిల్లలు, అయిదుగురు మగ పిల్లలు ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు మానసిక దివ్యాంగులు కూడా ఉన్నారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అన్ని సౌకర్యాలతో ఈ సంస్థ కొనసాగుతోంది. ఇక్కడ పెరిగే పిల్లల్లో కొందరిని విదేశీయులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దత్తత తీసుకెళ్లారు. అలా ముగ్గురు ఇటలీ, ఒకరు అమెరికా వెళ్లారు. ఈ పిల్లలను దత్తత తీసుకోవాలంటే స్త్రీ శిశు సంక్షేమ శాఖను ఆశ్రయించాల్సి ఉంటుందని శిశుగృహ మేనేజర్ తేజస్విని తెలిపారు.

ఎవరైనా పోషించలేని పిల్లలను వదిలి వేయకుండా తమకు సమాచారం ఇస్తే శిశుగృహకు తీసుకొస్తామని వివరించారు.

ఆశ్రయించాల్సిన ఫోన్ నంబర్ : 88851 76924 ప్రభుత్వ ఆశ్రయం పొందవచ్చుఅనాథ పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులకు తమ వసతిగృహాల్లో ఆశ్రయం కల్పిస్తున్నాం. పిల్లలకు చదువు విషయంలో ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నాం.

– సరస్వతి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి, కరీంనగర్

# ప్రజా ప్రయోజన.. ఉపాధి

పరిగి : 'జాతీయ ఉపాధి హామీ పథకం' రూపు మారుతోంది. ఇప్పటివరకు దీనికింద కేవలం భూ అభివృద్ధి, గ్రామాల్లో సిమెంటు రహదారుల నిర్మాణం, నర్సరీల నిర్వహణ తదితర పనులు మాత్రమే సాగేవి. ఈ ఆర్థిక సంవత్సరంలో వీటితో పాటు ఇతర సామాజిక అభివృద్ధి పనులు చేపట్టేందుకు 'జిల్లా గ్రామీణాభి వృద్ధి సంస్థ' ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. దీంతో జిల్లాలోని ఈ పథకం అమలవుతున్నా ఆయా గ్రామాలు, మండలాలు మరింత ప్రగతి పథంలో పయనించే అవకాశం లభిస్తోంది. దీనికి సంబంధించి కథనం.

స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి అమలు జిల్లాలో 4 నియోజకవర్గాలు, 20 మండలాలు, 566 గ్రామ పంచాయతీలున్నాయి. ఉపాధి కింద అనేక రకాల పనులకు అవకాశం ఉన్నప్పటికీ కొన్నేళ్లుగా కొన్నింటికే పరిమితమయ్యారు. ఈసారి అవకాశం ఉన్న వాటన్నింటినీ స్పెషల్ డ్రైవ్‌లో గుర్తించి చేపట్టనున్నారు. ఇటీవలే పదవీ బాధ్యతలు చేపట్టిన జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ జిల్లా అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నారు. ఈ క్రమంలోనే పరిగిలో పర్యటించి డంపింగ్ యార్డును ఎట్టి పరిస్థితుల్లోనూ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

మొత్తం 9,169 పనులు.. కావాల్సిన నిధులు రూ.91.23

జిల్లా వ్యాప్తంగా మెటీరియల్ కాంపొనెంట్ పనుల కింద ఇప్పటివరకు 9,169 పనులను గుర్తించగా రూ.91.23కోట్లు అవసరమవుతాయని అంచనా వేశారు. ఉత్సాహంగా ఉన్న వారిని గుర్తించి చేపట్టేవిధంగా ప్రోత్సహించనున్నారు.

వీటిపై దృష్టి సారిస్తారు

విద్యాలయాలకు ప్రహరీల నిర్మాణం.

వాన నీటి సంరక్షణకు ప్రాధాన్యం.అంగన్‌వాడీ పాఠశాలల్లో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణ పనుల గుర్తింపు. ఆర్థికంగా వెనుకబడిన కులాలకు (ఎస్సీ, ఎస్టీలు) పశువుల పాకలు, జీవాలు, కోళ్లషెడ్ల నిర్మాణం.తుది దశలో క్షేత్రస్థాయి సర్వే వివిధ అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నాం. అంగన్‌వాడీ పాఠశాలల్లో శౌచాలయాల నిర్మాణానికి రూ.25వేలు వెచ్చిస్తాం. పనుల కోసం క్షేత్ర స్థాయి సర్వే తుది దశకు చేరుకుంది. ఆయా రకాల పనులతో ప్రజలకు మరింత ప్రయోజనం కలుగుతుంది. శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి.

# డెంగీలో.. ప్లాస్మా లీకేజీ.. జర జాగ్రత్త!

హైదరాబాద్: డెంగీ సోకితే ప్లేట్‌లెట్లు తగ్గడం కంటే.. ప్లాస్మా లీకేజీ ఎక్కువ ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా డెంగీ కేసులు పెరుగుతున్నాయి. గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, ఫీవర్ ఆసుపత్రుల్లో ఎక్కువ మంది చికిత్స పొందుతున్నారు.

ప్లాస్మా లీకేజీలు ఎలా గుర్తించాలంటే..

డెంగీ వైరస్‌తో రక్త నాళాల్లోని ఎండోథిలియం పొరలో వాపు వచ్చి మధ్యలో ఖాళీలు ఏర్పడతాయి. తద్వారా రక్తంలోని ప్లాస్మా లీకేజీ అవుతుంది. కొందరిలో డెంగీ సంక్లిష్టం కావడానికి ప్లాస్మా లీకేజీ ప్రధాన కారణం. కాళ్లు, కంటిచుట్టూ వాపు, రక్తంలో హెమటోక్రిట్ స్థాయిలు పెరగడం, పల్స్, బీపీ పడిపోవడం, కాళ్లు, చేతులు



చల్లబడటం, వాంతులు, కడుపులో తీవ్రమైన నొప్పి తదితర లక్షణాలు కన్పిస్తే.. ప్లాస్మా లీకేజీగా భావించి అప్రమత్తం కావాలని సూచిస్తున్నారు. ఆలస్యం చేయడం వల్ల హెమరేజిక్ షాక్ సిండ్రోమ్‌కు దారి తీసి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు.

నిర్లక్ష్యం పనికి రాదు –డాక్టర్ రాజారావు, సీనియర్ వైద్యులు

డెంగీ సోకితే భయపడాల్సిన అవసరం లేదు. నిర్లక్ష్యం కూడా పనికి రాదు. డెంగీకి ఎలాంటి మందులు లేవు. జ్వరం వస్తే పారాసిటమాల్‌పాటు ఫ్లూయిడ్స్ ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. పది శాతం మందిలో కొంత ప్లాస్మాలీకేజీల ముప్పు ఉంటుంది. ప్లాస్మా లీకేజీ లక్షణాలు కన్పించిన వెంటనే వైద్యులను సంప్రదించాలి.

# బోధనకు వ్యథ

సంగారెడ్డి : పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధనకు ఇబ్బందిగా మారింది. ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ముగిసిన తర్వాత ఖాళీలు మరిన్ని పెరిగాయి. ఖాళీగా ఉన్న స్థానాల్లో గతంలో విద్యా వాలంటీర్లను(అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లు) నియమించే వారు. ఈ ఏడాది విద్యా సంవత్సరం ప్రారంభమై మూడో నెల కొనసాగుతున్నప్పటికీ నియామకాలపై ఎలాంటి స్పష్టత లేదు. ఖాళీలు ఎక్కువగా ఉన్న జిల్లాల్లో వాలంటీర్లను నియమించుకోవాలని ఇటీవల నిర్వహించిన సమావేశంలో పాఠశాల విద్యాశాఖ కమిషనర్ మౌఖిక ఆదేశాలు ఇచ్చారు. అధికారికంగా ఆదేశాలు రాకపోవడంతో వాలంటీర్లను నియమించుకునేందుకు విద్యాశాఖ అధికారులు వెనకడుగు వేస్తున్నారు.

కలెక్టర్ చొరవ చూపితే మేలు

గత రెండు విద్యా సంవత్సరాల్లో పదో తరగతి విద్యార్థుల కోసం కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని విద్యా వాలంటీర్లను నియమించారు. ఉన్నత పాఠశాలల్లో బోధించే 299 ఉపాధ్యాయ పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నత పాఠశాలల్లో విద్యా వాలంటీర్లను నియమిస్తే విద్యార్థులకు ఉపయుక్తంగా ఉంటుంది.

మారుమూల మండలాల్లో..జిల్లాలోని 1247 పాఠశాలల్లో 1,111



ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇటీవల బదిలీలు, పదోన్నతులు నిర్వహించడంతో పట్టణ ప్రాంతాల్లో పోస్టులన్నీ దాదాపు భర్తీ అయ్యాయి. ఖాళీలన్నీ నారాయణఖేడ్, జహీరాబాద్, అందోలు నియోజకవర్గాల్లోని మారుమూల మండలాల్లోనే ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడి ఉపాధ్యాయులు సంగారెడ్డి, పటాన్‌చెరు మండలాలకు బదిలీలు, పదోన్నతులపై వెళ్లారు. ముఖ్యంగా కల్హేర్, సిర్గాపూర్, కంగ్టి, మనూరు, రాయికోడ్, నాగల్‌గిద్ద, ఝరాసంగం తదితర మండలాల్లోనే ఎక్కువ ఖాళీలు ఉన్నాయి. ఉన్నతాధికారులకు విన్నవిస్తాం: వెంకటేశ్వర్లు, జిల్లా విద్యాధికారిపాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టుల వివరాలు సేకరించాం. ఖాళీ పోస్టుల వివరాలు ఉన్నతాధికారులకు పంపించాం. ఈ పోస్టుల్లో విద్యా వాలంటీర్లను నియమించాలని విన్నవిస్తాం.

# కళ తప్పిన చెరువు

సంగారెడ్డి :కల్హేర్ మండలం కామిని చెరువు కింద 355 ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం 40 ఎకరాల్లో బోర్ల కింద మాత్రమే వరినాట్లు వేశారు. చెరువులో అరకొరగా నీరుండమే కారణం.

కొండాపూర్ మండలం మల్కాపూర్ పెద్ద చెరువు కింద 2600 ఎకరాల ఆయకట్టు ఉంది.. జల వనరు నిండకపోవడంతో బోర్ల కింద 250 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు వేశారు. మిగతా భూములు పడావుగా దర్శనమిస్తున్నాయి.వర్షాభావ పరిస్థితులతో జిల్లాలో జల వనరులు కళ తప్పాయి. అత్యధిక మంది రైతులు చెరువులు, కుంటల ఆధారంగానే పంటలు వేస్తున్నారు. కొన్ని ప్రాంతాల్లో వర్షాధారంగా పంటలు సాగవుతున్నాయి. ప్రధానంగా పత్తి, వరి, సోయాబీన్, కంది, మినుము, పెసర తదితర రకాలు వేస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా ఏడు చెరువుల్లో మాత్రమే పూర్తిస్థాయి నీరుంది. మిగతా వీటి కింద బోర్లు ఉన్న వారు మాత్రమే పంటలు సాగు చేస్తున్నారు. ఇతర భూములు బీడుగా ఉన్నాయి. నిత్యం ఆకాశంలో కారు మబ్బులు కనిపిస్తున్నా.. చిరు జల్లులు మాత్రమే కురుస్తుండగా అన్నదాతలు దిగులు చెందుతున్నారు. వర్షాలు ఆశించిన స్థాయిలో పడక పోవడమే ప్రధాన కారణమని నీటిపారుదల శాఖ అధికారులు పేర్కొంటున్నారు.వరి సాగుపై ప్రభావం: ఏసయ్య, ఎస్‌ఈ, నీటిపారుదల శాఖ జిల్లాలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవలేదు. దీంతో నీటి వనరులలో నిల్వ తగ్గింది. చెరువులు, కుంటల్లో సరిపడా జలాలు లేకపోవడంతో రైతులు చాలా చోట్ల సాగుకు దూరంగా ఉన్నారు. పొలాలు పడావుగా ఉన్నాయి. ప్రధానంగా వరిసాగుపై తీవ్ర ప్రభావం చూపింది. నారు పోసినా నాట్లు వేయలేదు. కొన్ని ప్రాంతాల్లో బోర్ల కింద వరి సాగవుతోంది.



# బెజవాడ కనకదుర్గమ్మకు పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

విజయవాడ: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను సీఎం చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. సతీమణి నారా భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి, దేవాన్ష్‌తో కలిసి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. చంద్రబాబు తలకు స్థానాచార్యులు శివప్రసాద్ శర్మ పరివేట్టం చుట్టగా.. పట్టువస్త్రాలు, సుమంగళ ద్రవ్యాలను తలపై ఉంచి సీఎం తీసుకెళ్లారు. దుర్గమ్మకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీఎం పట్టువస్త్రాలు సమర్పించారు. అంతకుముందు ఆలయం వద్ద సీఎంకు ఆలయ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. చంద్రబాబు తన కుటుంబ సభ్యులతో అంతరాలయంలో మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా డోనర్ సెల్ వివరాలను దేవదాయ శాఖ కమిషనర్, ఈవో సీఎంకు వివరించారు. దుర్గమ్మ భక్తులందరికీ ముఖ్యమంత్రి చంద్రబాబు దసరా శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "మూలా నక్షత్రం రోజు దుర్గమ్మను దర్శించుకోవడం నా అదృష్టం. లక్షల మంది భక్తులు ఎంతో నమ్మకంతో దుర్గమ్మను దర్శించుకుంటున్నారు. మంచి పనులను ఆశీర్వదించాలని దుర్గమ్మను కోరుకున్నా. సేవా కమిటీ ద్వారా అనేక రకాల సేవలు అందిస్తున్నాం. దుర్గగుడి పాలక మండలి సభ్యులకు అభినందనలు. క్యూలైన్లలో భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేశారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు ఎంతో శ్రమించారు. ఇంద్రకీలాద్రిపై వీఐపీ భక్తులు కూడా సహకరించారు. దుర్గగుడి సన్నిధిలో సౌకర్యాలు బాగున్నాయని భక్తులు చెప్పారు. దుర్గమ్మ దయవల్ల రాష్ట్రంలో పుష్కలంగా వర్షాలు పడ్డాయి. అమ్మవారి దయతో రాష్ట్రంలో నదుల అనుసంధానం పూర్తవ్వాలి. రాష్ట్ర ప్రజలందరిపైనా దుర్గమ్మ ఆశీస్సులు ఉండాలి. ఇవాళ వచ్చే భక్తులందరికీ ఉచిత దర్శనం కల్పించారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగానే మా నిర్ణయాలు ఉంటాయి. ప్రతి దేవాలయానికి పూర్వ వైభవం వచ్చేలా కృషిచేస్తాం" అని తెలిపారు.




# సమాజంలో కాంగ్రెస్ విషబీజాలు నాటుతోంది: ప్రధాని మోదీ

ముంబయి: ప్రధాని నరేంద్ర మోదీ కాంగ్రెస్ పార్టీపై విమర్శలు గుప్పించారు. సమాజంలో కాంగ్రెస్ విష బీజాలు నాటుతూ..హిందువులను విభజించాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముస్లింలను కేవలం ఓటు బ్యాంకు కోసమే వాడుకుంటున్నారని దుయ్యబట్టారు. హరియాణా ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ(భాజపా) విజయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడ కాంగ్రెస్ చేసిన కుట్రలన్నీ విఫలమయ్యాయని అన్నారు.

మహారాష్ట్రలో రూ.7,600 కోట్ల విలువైన వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రధాని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణా ఎన్నికల్లో భాజపా చారిత్రాత్మక విజయం దేశ ప్రజల ఆలోచనను తెలియజేస్తోందని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఆదివాసీలు, ఇతర వెనుకబడిన తరగతులు(ఓబీసీలు), దళితులు భాజపాకు అండగా నిలిచారని పేర్కొన్నారు. "కాంగ్రెస్ తమ రిజర్వేషన్లను లాక్కొని తమను ఓటు బ్యాంకుగా వాడుకుంటోందని దళితులు గ్రహించారు. దేశంలోని రైతులను కూడా కాంగ్రెస్ తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. కానీ, తమకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ) ఎవరు ఇచ్చారో హరియాణా రైతులకు తెలుసు కాబట్టే వారు భాజపాను గెలిపించారు. ప్రజలు కాంగ్రెస్‌కు సరైన గుణపాఠం చెప్పారు" అని మోదీ అన్నారు. హరియాణాలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలనే ఉద్దేశంతో ప్రజల్లో తమను తప్పుగా చూపించడానికి ఎన్నో కథనాలు రచించి.. ద్వేషపూరిత రాజకీయాలకు పాల్పడిందని ఆరోపించారు. సమాజాన్ని నాశనం చేయడానికి పూనుకున్న ఈ శక్తులన్నింటికీ రాబోయే ఎన్నికల్లో మహారాష్ట్ర ప్రజలు తగిన సమాధానం ఇస్తారని భావిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే ప్రజలు భాజపా–మహాయుతి ప్రభుత్వానికి ఓటు వేయాలని కోరారు.




అమరావతి: జగన్ ఇకనైనా తప్పుడు ప్రచారాలు మానుకోవాలని మంత్రి నారా లోకేశ్ తెలిపారు. ఈమేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. "వరద బాధితులకు ఇస్తామన్న రూ.కోటిలో ఒక్క రూపాయి ఇప్పటికీ ఇవ్వలేదు ఫేక్ జగన్. ఒక వాటర్ ప్యాకెట్, ఒక బిస్కెట్ ప్యాకెట్ కూడా పంపిణీ చేయని ఆయన.. వరద సహాయక చర్యలపై విషం కక్కుతున్నారు. వరద ప్రాంతాల్లో కొవ్వొత్తులు, అగ్గిపెట్టెలకు రూ.23 కోట్లు అంటూ ఫేక్ ప్రచారం చేయిస్తున్నారు. వీటికి ఖర్చు రూ.23 లక్షలు కూడా కాలేదు. జగన్ పాలనలో వెలువడిన చీకటి జీవోలు, చీకటి లెక్కలు కాదు కూటమి ప్రభుత్వానివి. మా ప్రభుత్వం లెక్కలు అన్నీ పారదర్శకంగా ఉన్నాయి. ఇందుకు సంబంధించి 'ఎక్స్'లో పోస్టు పెట్టాం. చదువు వస్తే చదువుకో.. కళ్లుంటే చూడు. తాడేపల్లి ప్యాలెస్ కలుగులో దాక్కుని ఎగ్ పఫ్‌ల పేరుతో జగన్ ప్రజాధనం రూ.కోట్లు మెక్కారు. ఫేక్ జగన్ ఇకనైనా నీ ఫేక్ ప్రచారాలు ఆపు" అని లోకేశ్ విమర్శించారు.

# మూలా నక్షత్రం.. ఇంద్రకీలాద్రిపై భారీగా భక్తుల రద్దీ



## సరస్వతీదేవిగా దర్శనమిస్తున్న దుర్గమ్మ

విజయవాడ: దసరా ఉత్సవాల్లో కీలకమైన మూలానక్షత్రం సందర్భంగా దుర్గమ్మ సరస్వతీదేవి రూపంలో బుధవారం దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా భక్తులు తరలివస్తున్నారు. భక్తులను పోలీసులు కంపార్ట్‌మెంట్‌లలో ఉంచి క్యూలో పంపుతున్నారు. దర్శనం చేసుకున్న వారిని త్వరగా దిగువకు పంపుతున్నారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు 110 హోల్డింగ్ ఏరియాలను ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది ప్రతి భక్తుడికీ ఒక లడ్డూను ఉచితంగా అందజేస్తున్నారు. నగరంలోని వినాయకగుడి, కుమ్మరిపాలెం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చారు. నేడు టికెట్ దర్శనాలను రద్దు చేసి వేకువజామున 3 గంటల నుంచే అందరికీ సర్వదర్శనం కల్పించారు.

# ఫేసు టు ఫేస్ కూర్చుందాం రండి.. వైసీపీకి అనిత సవాల్

అమరావతి, అక్టోబర్ 9: వరద సహాయానికి సంబంధించి సాక్షి పత్రికలో వచ్చిన వార్తలపై హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. వరద సహాయంపై సాక్షి పత్రికలో ఇష్టం వచ్చినట్లు వార్తలు రాస్తున్నారని మండిపడ్డారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. వరద సాయంపై చర్చకు రావాలంటూ వైసీపీకి హోంమంత్రి సవాల్ విసిరారు. సొంత పత్రికల్లో కాదు ఫేస్ టు ఫేస్ కూర్చుందామని ఛాలెంజ్ చేశారు. "వరద సాయంపై చర్చించడానికి మేం సిద్ధం.. వైసీపీ నుంచి చర్చకు ఎవరైనా వస్తారా..? ఎన్టీఆర్ జిల్లాలో రూ. 92 కోట్లు మాత్రమే ఆహారం కోసం ఖర్చు చేశాం. వరద సాయం కింద ఎన్టీఆర్ జిల్లాకు విడుదల చేసిందే రూ. 139 కోట్లు. అంతకు మించి అవినీతి జరిగిందని ఎలా చెబుతారు..?" అంటూ ప్రశ్నించారు. వరద సాయం అందించడమే కాకుండా.. బుడమేరు గండ్లను పూడ్చేలా మంత్రులకు బాధ్యతలు అప్పజెప్పారన్నారు. వరద సమయంలో దాదాపు పదిరోజుల పాటు ముఖ్యమంత్రి



చంద్రబాబు నాయుడు కలెక్టరేట్‌లో మకాం వేసి రాష్ట్రంలో ఉన్న వరద ప్రాంతాల్లో పరిస్థితి సమీక్షించారని.. అంతేకాకుండా వార్డులకు సీనియర్ ఐఏఎస్ అధికారులను నియమించారని తెలిపారు.



# ప్రభుత్వం ఇన్ని పనులు చేస్తే జగన్‌కు కనిపించలేదా?.. ఏపీ మంత్రులు మండిపాటు

అమరావతి: వైకాపా నేతలు అనవసర ఆరోపణలు చేస్తున్నారని మంత్రులు అనిత, అనగాని సత్యప్రసాద్, నారాయణ విమర్శించారు. వరద సాయంపై అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. సుమారు 110 రోజుల పాలనలో ఎన్ని మంచి పనులు చేశామో తెలుసుకోవాలన్నారు. ఇకనైనా బురద రాజకీయాలు మానుకొని చేస్తున్న మంచి పనులు గుర్తించాలన్నారు. సాక్షి తప్పుడు కథనాలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. పదేపదే దుష్ప్రచారాలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. "వరద సాయం కింద మొత్తం ఖర్చయింది రూ.601 కోట్లు. ఆహారానికి రూ.92.5 కోట్లు, తాగునీటికి రూ. 11.2 కోట్లు, మెడికల్ కేర్‌కు రూ.4.55 కోట్లు, పారిశుద్ధ్యానికి రూ.22.56 కోట్లు ఖర్చయింది. ఎన్టీఆర్ జిల్లాలో రూ.139.44 కోట్లు ఖర్చు పెట్టాం. వరదలతో తీవ్రంగా నష్టపోతే ఆదుకోవాల్సిందిపోయి.. విమర్శలు చేస్తారా? విపత్తు సమయంలో ఒకవైపు వరద, మరోవైపు వర్షపు నీటితో అతులాకుతమైంది. నాలుగు రోజులు నీళ్లలోనే ఉండటం వల్ల తాగునీటి సరఫరా లేదు. యుద్ధ ప్రాతిపదికన నీళ్లు ఇచ్చాం. ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి కాబట్టే సీఎం చంద్రబాబు ఎప్పటికప్పుడు మాకు ఆదేశాలిచ్చారు. పాలు, బిస్కెట్లు ఇలా అన్నిరకాల వస్తువులు బాధితులకు వెంటనే అందజేశాం. పారిశుద్ధ్య నిర్వహణ కోసం బయట ప్రాంతాల నుంచి 7 వేల మందిని పిలిపించాం. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి 3 వేల మంది పనిచేశారు. మొత్తం 10 వేల మంది నిద్రాహారాలు మానుకొని రాత్రింబవళ్లు కష్టపడ్డారు. రోడ్లు, ఇళ్లలో పేరుకున్న బురదను ఫైరింజిన్ల ద్వారా శుభ్రం చేయించాం. ప్రభుత్వం ఇన్ని పనులు చేస్తే జగన్‌కు కనిపించలేదా? పేపర్ ఉందని.. నోటికొచ్చినట్లు సాక్షిలో అవాస్తవాలు రాస్తే ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు" అని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.




ఎగ్జిట్ పోల్స్ అంచనాలను తలకిందులు చేస్తూ హరియాణాలో కాంగ్రెస్ ఓటమి పాలైంది. ఈ క్రమంలో ఫలితాలపై ఆ పార్టీ అనుమానాలు వ్యక్తంచేసిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాల వేళ హరియాణాలో పరాజయంపై కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ తాజాగా స్పందించారు. ఈ అనూహ్య ఫలితాలను తాము విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈమేరకు 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. "జమ్మూకశ్మీర్ ప్రజలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ఈ గెలుపు మన రాజ్యాంగం సాధించిన విజయం. ప్రజాస్వామ్య ఆత్మగౌరవానికి దక్కిన విజయం. ఇక హరియాణాలో అనూహ్య ఫలితాలపై మేం విశ్లేషణ చేపట్టాం. చాలా అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయి. వాటిని ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తాం. హరియాణాలో పార్టీ కోసం నిరంతరం పనిచేసిన ప్రతిఒక్కరికీ ధన్యవాదాలు. ప్రజల హక్కులు, సామాజిక, ఆర్థికన్యాయం, నిజం కోసం మా పోరాటం కొనసాగుతుంది. ప్రజల గళాన్ని మేం వినిపిస్తూనే ఉంటాం" అని రాహుల్ గాంధీ రాసుకొచ్చారు. హరియాణా లో వరుసగా మూడోసారి భాజపా విజయం సాధించింది. బుధవారం వెలువడిన ఫలితాల్లో 90 సీట్లకు గానూ 48 చోట్ల జయకేతనం ఎగురవేసింది. ఉదయం కౌంటింగ్ ప్రారంభం కాగానే కాంగ్రెస్ ఆధిక్యంలో ఉన్నట్లు కనిపించింది. గంట తర్వాత క్రమంగా ఫలితాలు తారుమారవడం ప్రారంభించి చివరకు భాజపా విజయం సాధించింది. కాంగ్రెస్ 37 సీట్ల వద్దే ఆగిపోయింది. కొన్నిచోట్ల మెజారిటీలు అత్యల్పంగా నమోదవడంతో రెండు పార్టీల మధ్య ఓట్ల తేడా స్వల్పంగానే ఉంది. దీంతో ఈ ఫలితాలపై కాంగ్రెస్ నేతలు అనుమానాలు వ్యక్తంచేశారు. ఈసీ పనితీరుతో పాటు ఈవీఎంలపైనా ఆరోపణలు చేశారు. మరోవైపు జమ్మూకశ్మీర్‌లో ఇండియా కూటమి ఘన విజయం సాధించింది. ఆర్టికల్ 370 రద్దు, కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజన తర్వాత జరిగిన ఈ ఎన్నికల్లో ఎన్సీ, కాంగ్రెస్ కూటమి అధికారాన్ని చేజిక్కించుకుంది. కూటమిలోని ఎన్సీ 42, కాంగ్రెస్ 6, సీపీఎం 1 సీటును గెలుచుకున్నాయి. భాజపా 29 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా అవతరించింది.

# దుష్టసంప్రదాయాన్ని ఈ ప్రభుత్వం తీసుకొచ్చిందంటూ జగన్ ఆగ్రహం



అమరావతి, అక్టోబర్ 9: మంగళగిరి నియోజకవర్గంలో ప్రత్యేక పరిస్థితులు ఉన్నాయని.. ఈ నేపథ్యంలో పార్టీ కార్యకర్తలకు పూర్తి భరోసా ఇవ్వాలని భావించామని మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మంగళగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ నేతలు , కార్యకర్తలతో జగన్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికార దుర్వినియోగంతో కార్యకర్తలకు నష్టం చేస్తున్నప్పుడు కచ్చితంగా భరోసా ఇవ్వానలని.. ఆ ఉద్దేశంతోనే ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

**నేను చేయొద్దని చెప్పినా...** రెడ్‌బుక్ అనేది ఏమైనా పెద్దపనా.. ఎప్పుడూ లేని దుష్టసంప్రదాయాన్ని చంద్రబాబు ప్రభుత్వం తీసుకు వచ్చిందని విమర్శించారు. "ఇప్పుడు నేను చేయొద్దని చెప్పినా మా వాళ్లు కూడా బుక్స్ మెయింటెన్ చేయడం మొదలుపెడుతున్నారు. అన్యాయం చేసేవారి పేర్లను, అలాంటి అధికారుల పేర్లను రాసుకుంటున్నారు. అదే సమయంలో మేం గుడ్‌బుక్ కూడా రాసుకోవడం మొదలుపెట్టాం" అని అన్నారు. పార్టీకి మంచి చేసిన వారిని, కష్టపడే వారి పేర్లను కూడా రాసుకుంటున్నామని వారికి తప్పకుండా అవకాశాలు, ప్రమోషన్లు ఉంటాయన్నారు.

**మనం ముందడుగు వేశాం..** " పార్టీ పరంగా కొన్ని నిర్ణయాలు కూడా తీసుకున్నాం. అనేక సంక్షోభాలను ఎదుర్కొన్నాం. కోవిడ్ లాంటి మహా సంక్షోభాన్ని ఎదుర్కొన్నాం. ఇప్పుడు పరిస్థితులు ఏంటో మీరు చూడండి. ప్రతి అంశంలోనూ తిరోగమనం కనిపిస్తోంది. వివక్ష, పక్షపాతం కనిపిస్తున్నాయి. ప్రతి ఇంట్లోనూ దీనిపై ఇప్పుడు చర్చ జరుగుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కష్టాలు ఉంటాయి. కష్టాలనుంచే నాయకులు పుడతారు. నన్ను16 నెలలు జైల్లో పెట్టి తీవ్రంగా వేధించారు. అయినా ప్రజల ఆశీస్సులతో మనం ముందడుగు వేశాం" అని పార్టీ నేతల సమావేశంలో జగన్ పేర్కొన్నారు.

# కాలుష్య కోరల నుంచి సమాజాన్ని రక్షిద్దాం.. ఇదే నా విజ్ఞప్తి



విజయవాడ, అక్టోబర్ 9: పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణపై పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో విజయవాడలో వర్కుషాపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు నిపుణులు, మేధావులు, ఎన్జీవోల సూచనలు సమాజానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ వర్కుషాపు ద్వారా పరిశ్రమల ఏర్పాటు, పర్యావరణ పరిరక్షణ రెండు అంశాలపై వేసే అడుగులపై అందరికీ స్పష్టత వస్తుందన్నారు. ఈ ఐదేళ్ల కాలంలో ఎంతవరకు కాలుష్యాన్ని నియంత్రించాలనే అంశంపై ఆలోచన చేస్తున్నామని తెలిపారు.

**పెరుగుతున్న కాలుష్యంపై ఆందోళన...** "పీసీబీ ఛైర్మన్‌కు నా ఆలోచన చెప్పిన వెంటనే.. ఈ వర్కుషాపును ఏర్పాటు చేశారు. అన్ని రంగాల నిపుణులు, ఎన్జీవోలను ఆహ్వానించడం అభినందనీయం. నేను పర్యావరణ ప్రేమికుడిని.. ప్రకృతి బాగుండాలని కోరుకునే వ్యక్తిని.. ప్రకృతి ప్రేమికులు ఎంత తపన పడతారో నాకు తెలుసు. భూమి మీద కనీస బాధ్యత లేకుండా మనం జీవనం సాగిస్తున్నాం. భూమిని మనం సొంతం చేసుకోవడం కాదు.. భూమే ఏదొకనాటికి మనలను సొంతం చేసుకుంటుంది. 974 కిలోమీటర్ల కోస్టల్ కారిడార్ ఉంది.. దానిని అభివృద్ధి చేయాలి. పర్యావరణ సమతుల్యత దెబ్బ తినకుండా.. పరిశ్రమల ఏర్పాటు కావాలి.

భవిష్యత్ తరాల కోసం.. మనమంతా ఇప్పటి నుంచే ఆలోచన చేయాలి. జల, వాయి కాలుష్యాన్ని నియంత్రించడంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి" అని పిలుపునిచ్చారు.

**ప్రత్యేక దృష్టి...** "ఈ వర్కుషాపుకు వచ్చిన నిపుణులు సలహాలతో సమాజానికి మరింత మేలు జరగాలనేది నా ఆకాంక్ష. మీ అనుభవం, మీ మేధస్సు ఈ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడాలి. విపరీతంగా కాలుష్యం పెరుగుతున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. కాలుష్య కోరల నుంచి సమాజాన్ని రక్షించడంలో మీరంతా పాత్రధారులు కావాలి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అంటే.. పరిశ్రమల యాజమాన్యాలలో అపోహలు ఉన్నాయి. ఉద్దేశపూర్వకంగా ఇబ్బందులు పెడతారనే అభద్రత పీసీబీపై ఉంది. దీంతో ఆ తర్వాత పాలకులు పరిశ్రమల ద్వారా వచ్చే కాలుష్యాన్ని పట్టించుకోవడం మానేశారు. ఇక నుంచి పరిశ్రమల ఏర్పాటు, కాలుష్యం నివారణ రెండు అంశాలపైన ప్రత్యేక దృష్టి పెట్టాం. మీ అమూల్యమైన సలహాల ద్వారా పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని నా విజ్ఞప్తి" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.

# ‘ఖిలాడీ’ బ్యూటీ టాటూను చూశారా

తెలుగు అమ్మాయిలు హీరోయిన్స్‌గా ఆఫర్లు దక్కించుకోవడం కష్టం అనుకుంటున్న సమయంలో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ డింపుల్ హయతి. మెగా హీరో వరుణ్ తేజ్ నటించిన గద్దలకొండ గణేష్ సినిమాలో ఐటెం సాంగ్ చేయడం ద్వారా ఇండస్ట్రీలో మంచి గుర్తింపు దక్కించుకున్న డింపుల్ హయతీ హీరోయిన్ గా రవితేజకు జోడీగా ఖిలాడీ సినిమాలో నటించిన విషయం తెల్సిందే. ఆ సినిమా నిరాశ పరిచిన ఈ అమ్మడికి మంచి గుర్తింపు దక్కించుకుంది. సోషల్ మీడియా ద్వారా, సినిమాల ద్వారా ఏదో ఒక రకంగా వార్తల్లో ఉంటుంది. తాజాగా ఈ అమ్మడు మరోసారి వార్తల్లో నిలిచింది. డింపుల్ హయతి తాజాగా తన టాటూను సోషల్ మీడియా ద్వారా షేర్ చేసింది. తనకు జంతువులు అంటే అమితమైన ఇష్టం. జంతువులతో నా ఆత్మ కమ్యూనికేట్ చేస్తుంది. నేను ఎప్పుడూ



జంతువుల్లో నా స్నేహితులను వెతుక్కుంటూ ఉన్నాను. థాయ్‌లాండ్‌లోని క్రాబీ ఎలిఫెంట్ అభయారణ్యంలో ఏనుగులతో ఫోటోలు దిగి ఆ ఫోటోలను షేర్ చేశారు. అంతే కాకుండా తన కాలిపై వేసుకున్న ఏనుగు ఆకారం టాటూను షేర్ చేసింది. చాలా స్టైలిష్ లుక్ లో డింపుల్ హయతీ కనిపిస్తుంది అంటూ నెటిజన్స్ తో పాటు ఆమె అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. గత ఏడాది రామబాణం సినిమాలో నటించింది. గోపీచంద్ హీరోగా నటించిన రామబాణం సినిమాలో ఈ అమ్మడు నటించడం ద్వారా ప్రేక్షకులను అలరించింది. కానీ కొన్ని కారణాల వల్ల సినిమా నిరాశపరచడంతో ఈ అమ్మడు మళ్లీ ఆఫర్ ను సొంతం చేసుకోలేక పోయింది. అయినా సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేస్తూ వస్తుంది.

ఐటెం సాంగ్‌లకు ఓకే చెబుతున్న ఈ అమ్మడు ముందు ముందు మరిన్ని సినిమాల్లో నటించాలని ఆశ పడుతోంది. సోషల్ మీడియాలో మాత్రం ఈ అమ్మడు రెగ్యులర్‌గా అందాల ఆరబోత ఫోటోలు షేర్ చేయడం ద్వారా ఎక్కువ ఆఫర్లు సొంతం చేసుకుంటుందని అంతా అనుకున్నారు. కానీ డింపుల్ హయతికి మాత్రం ఆశించిన స్థాయిలో పెద్ద సినిమాల్లో ఆఫర్లు రావడం లేదు, చిన్న సినిమాల్లో మాత్రం ఈమె నటించేందుకు ఆసక్తి చూపించడం లేదు. ముందు ముందు ఈ అమ్మడు హీరోయిన్‌గా బిజీ అవ్వాలని అంతా కోరుకుంటున్నారు. నెట్టింట మాత్రం ఈ అమ్మడి ఫాలోయింగ్ రోజు రోజుకు అందాల ఆరబోత కారణంగా పెరుగుతూనే ఉంది.

# సినిమాల కోసం శరీరాన్ని చూపించడం ఇష్టం లేదు

సంతోష్ శోభన్ హీరోగా అనీల్ కుమార్ ఆల్ల దర్శకత్వంలో వచ్చిన కళ్యాణం కమనీయం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు హీరోయిన్ గా పరిచయం అయిన ముద్దుగుమ్మ ప్రియా భవానీ శంకర్. మొదటి సినిమాతోనే నటిగా మంచి గుర్తింపు దక్కించుకుంది. కోలీవుడ్ లో ప్రస్తుతం వరుస సినిమాలు చేస్తున్న ఈ అమ్మడు టాలీవుడ్ నుంచి సైతం ఆఫర్లు దక్కించుకుంటుంది.. కానీ కొన్ని కండిషన్స్ పెడుతున్న కారణంగా ఆఫర్లు వెనక్కి పోతున్నట్లుగా వార్తలు వస్తున్నాయి. ఇటీవల బ్లాక్ సినిమాలో నటించింది. ఆ సినిమా ప్రమోషన్ లో భాగంగా ఈ అమ్మడు ఒక మీడియా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించింది. గ్లామర్ పాత్రల్లో నటించే ఆసక్తి చూపించక పోవడం వల్లే టాలీవుడ్ నుంచి వచ్చిన సినిమా ఆఫర్లు ఫైనల్ కాకుండానే క్యాన్సల్ అవుతున్నట్లుగా ఆమె మాటలను బట్టి అర్థం అవుతోంది. హీరోయిన్ గా నటించాలంటే స్కిన్ షో చేయాల్సిందే, గ్లామర్ గా కనిపించాల్సిందే అంటూ వస్తున్న వార్తలను, చెబుతున్న విషయాలపై ఆమె అసహనం వ్యక్తం చేసింది. అసలు శరీరాన్ని,



గ్లామర్ ని చూపించి సినిమాలకు ప్రేక్షకులను రప్పించడం ఏంటో అంది. కెరీర్ పరంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా తాను గ్లామర్ పాత్రలో నటించను అంటూ ఖరాకండీగా చెప్పేసింది. అంతే కాకుండా ఈ అమ్మడు ముందు ముందు ఆఫర్లు రాకున్నా స్కిన్ షో కు ఓకే చెప్పను అంది. శరీరాన్ని వస్తువుగా భావించను.. ప్రేక్షకులకు ఒక వస్తువుగా నా శరీరాన్ని చూపించాలని అనుకోవడం లేదు. అసలు అలాంటి పాత్రలను నేను అంగీకరించను. ఒక మోస్తరు వరకు సినిమాల్లో అందంగా కనిపించడం ఓకే కానీ ఎక్కువ పరిధి దాటితే మాత్రం అది బాగోదు అన్నట్లుగా తన అభిప్రాయం వ్యక్తం చేసింది. నెగటివ్ రోల్స్ చేయడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. హీరోయిన్ గానే నటించాలి అని నేను ఎప్పుడూ అనుకోవడం లేదు. అంతే కాకుండా నటిగా మంచి గుర్తింపు వచ్చే సినిమాలను నేను ఎప్పుడూ చేసేందుకు ముందు ఉంటాను అంటూ చెప్పుకొచ్చింది. ఫేమ్ సొంతం చేసుకోవడం కోసం స్కిన్ షో చేయాల్సిన అవసరం లేదు. సినిమాల్లో రాణించడానికి సైతం అందంగా కనిపిస్తే చాలు కానీ ఎక్కువగా స్కిన్ షో చేయాల్సిన అవసరం లేదు అన్నట్లుగా చెప్పుకొచ్చింది. అంతే కాకుండా సోషల్ మీడియాలో ఈమె చాలా అరుదుగా మాత్రమే ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. ఇలాంటి హీరోయిన్స్ ఇండియన్ సినిమా ఇండస్ట్రీకి వర్కౌట్ కారు అనే అభిప్రాయంను కొందరు వ్యక్తం చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం హీరోయిన్స్ అంటే ఇలా కూడా ఉంటారా... స్కిన్ షో చేయకుం టే హీరోయిన్ అని ఎలా అంటారు అంటూ కొందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి ప్రియా భవానీ మాత్రం స్కిన్ షో చేసేదే లేదు అంటోంది.




# హాలీవుడ్‌లో సత్తా చాటిన టాప్ 10 స్టార్లు



భారతీయ నటీమణులు ప్రపంచ సినీవేదికపై గొప్ప గుర్తింపు గౌరవం కలిగి ఉన్నారు. తమదైన అందం ప్రతిభతో ఆకట్టుకున్న వారి జాబితాలో ప్రియాంక చోప్రా, ఐశ్వర్యారాయ్, టబు, దీపిక పదుకొనే వంటి నాయికలు ఉన్నారు. దేశం కాని దేశంలో సత్తా చాటుతున్న మేటి భారతీయ ప్రతిభావంతుల గురించి చర్చిస్తే ఇలా ఉంది మ్యాటర్. జాక్వెలిన్ ఫెర్నాండెజ్ 2024లో కిల్- ఎమ్ ఆల్ 2తో హాలీవుడ్ సీన్‌లోకి ప్రవేశించింది. అక్కడ ఆమె లెజెండరీ జీన్-క్లాడ్ వాన్ డామ్‌తో స్క్రీన్‌ను షేర్ చేసుకుంది. ఎప్పటిలాగే అద్భుతంగా కనిపిస్తూ, ఆకట్టుకునే బైక్ స్టంట్ లు సహా థ్రిల్లింగ్ సన్నివేశాలతో తన యాక్షన్ విన్యాసాలను ప్రదర్శించింది. ఐశ్వర్య రాయ్ బచ్చన్ 2009లో స్టీవ్ మార్టిన్ సరసన ది పింక్ పాంథర్ 2తో హాలీవుడ్ రంగ ప్రవేశం చేసింది. ఆమె ఆన్-స్క్రీన్ ప్రెజెన్స్ మంత్రముగ్ధులను చేసింది. ఐష్ తనదైన అందం ప్రతిభతో అంతర్జాతీయంగా వేవ్స్ క్రియేట్ చేసింది. ప్రియాంక చోప్రా 2017లో బేవాచ్‌లో తన పాత్రతో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది. డ్వేన్ జాన్సన్‌తో స్క్రీన్‌ను షేర్ చేసుకున్న ప్రియాంక చోప్రా షో స్టాపర్ గా నిలిచింది. మ్యాట్రిక్స్ 4 లోను నటించింది. తనదైన ఆకర్షణ నటప్రతిభతో ప్రపంచవ్యాప్తంగా అభిమానుల హృదయాలను గెలుచుకుంది. ఆ తర్వాత పీసీ సిటాడెల్ సహా పలు వెబ్ సిరీస్ లలో నటించింది. ప్రస్తుతం సిటాడెల్ సీజన్ 2 చిత్రీకరణ సాగుతోంది. క్వాంటికో వెబ్ సిరీస్ చిత్రీకరణ సమయంలోనే నిక్ జోనాస్ తో ప్రేమలో పడిన సంగతి తెలిసిందే. 2017లో విన్ డీజిల్‌తో కలిసి నటించిన రిటన్ ఆఫ్ జేవియర్ కేజ్‌తో దీపికా పదుకొణె హాలీవుడ్ లో తనదైన ముద్ర వేసింది. దీపిక అందం ఆకర్షణకు హాలీవుడ్ మంత్ర ముగ్ధమైంది. హై ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాల్లో దీపిక సత్తా చాటింది. తన నటనకు గొప్ప ప్రశంసలు పొందింది. అలియా భట్ 2023లో హార్ట్ ఆఫ్ స్టోన్‌తో హాలీవుడ్‌లోకి అడుగుపెట్టింది, గాల్ గాడోట్ -జామీ డోర్నన్‌లతో స్క్రీన్‌ను పంచుకుంది. తన సహనటుల నుండి విపరీతమైన ప్రేమను పొందడమే కాకుండా సినిమాలో తన అద్భుత నటనతో ప్రేక్షకుల హృదయాలను కూడా గెలుచుకుంది.

**దేశీ నటులు చాలామంది ఉన్నరు:** అంతగా తెలుగు వారిలో పాపులర్ కాని దేశీ నటులు హాలీవుడ్ లో ఉన్నారు. భారతీయ సంతతికి చెందిన నటుల జాబితాలో ది జంగిల్ బుక్ లో మోగ్లీకి ప్రధాన పాత్ర పోషించిన నీల్ సేథి పేరు మార్మోగింది. డెడ్ పూల్ నుండి ఇండియన్ క్యాబీ డోపిందర్ గానూ అతడు కనిపించారు. న్యూయార్క్ నుండి వచ్చిన భారతీయ మూలాలున్న నటుడు నీల్ సేథి. ది జంగిల్ బుక్ నటుడిగా సుపరిచితం. బిల్ ముర్రే- బెన్ కింగ్స్లీ- ఇడ్రిస్ ఎల్బా- లుపిటా న్యోంగో- స్కార్లెట్ జోహన్సన్ -క్రిస్టోఫర్ వాల్కెన్ స్వరాలు అందించిన జంగిల్ బుక్ చిత్రంలో నీల్.. మోగ్లీ పాత్రలో నటించారు. ఈ పదేళ్ల వయస్సు పాత్ర కోసం ఆడిషన్ చేసిన వేలాది మంది పిల్లల నుండి అతడిని ఫైనల్ చేశారు. ప్రస్తుతం అతడు పశ్చిమంలో తనదైన ముద్ర వేయడానికి ప్రయత్నిస్తున్నాడు. డెడ్ పూల్ లో భారతీయ సంతతికి చెందిన టాక్సీ డ్రైవర్ కరణ్ సోని అకా డోపిందర్ పాత్ర ఆసక్తిని కలిగిస్తుంది. హిట్ టీవీ సిరీస్ హీరోస్ లో జన్యు శాస్త్రవేత్త మొహిందర్ సురేష్ పాత్రకు అంతర్జాతీయ టెలివిజన్ లో బాగా ప్రాచుర్యం పొందిన ముఖాల్లో సెంధిల్ రామమూర్తి ఒకరు. యుఎస్ లో పుట్టి పెరిగిన పొడగరి అందగాడు సెంధిల్ కన్నడిగ .. కోవర్ట్ ఎఫైర్స్ అనే మరో టీవీ సిరీస్ లో విల్ కాక్స్ పాత్ర పోషించినందుకు ఆయన చాలా పాపులరయ్యారు. దేవ్ పటేల్- ఫ్రీడా పింటో జంట స్లమ్‌డాగ్ మిలియనీర్ తో పాపులరయ్యారు. ఉత్తమ చిత్రంగా ఆస్కార్ అవార్డును గెలుచుకుంది ఈ చిత్రం. నటీనటులు హాలీవుడ్ లో పెద్ద పేరు తెచ్చుకున్నారు. ఫ్రిదా ఆ తర్వాత అనేక చిత్రాలలో నటించింది. రైజ్ ఆఫ్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్‌లోనూ కథానాయిక. వివిధ అంతర్జాతీయ అవార్డులు ఈవెంట్లలో ఆమె అద్భుతమైన రెడ్ కార్పెట్ ప్రదర్శనల కారణంగా బాగా వెలుగులోకి వచ్చింది. దేవ్ పటేల్ ఇటీవలే ది మంకీ మ్యాన్ చిత్రంతో నటుడిగా సత్తా చాటాడు. అతడితో పాటు ఈ చిత్రంలో తెలుగమ్మాయి శోభిత ధూళిపాల ప్రభావవంతమైన నటనతో ఆకట్టుకుంది. దిల్లీ విశ్వవిద్యాలయంలోని సెయింట్ స్టీఫెన్స్ నుండి గ్రాడ్యుయేట్ అయిన సూరజ్ శర్మ ఆస్కార్ చిత్రం లైఫ్ ఆఫ్ పైలో ప్రధాన పాత్ర పోషించాడు. ఇర్ఫాన్ ఖాన్ - టబులు తన తల్లిదండ్రులుగా కనిపించారు. ఈ చిత్రం నాలుగు అకాడమీ అవార్డులను పొందగా ఈ దిల్లీ కుర్రవాడు బాఫ్టా రైజింగ్ స్టార్ అవార్డుకు ఎంపికయ్యాడు. దర్శకుడు ఆంగ్ లీ అమాయకంగా కనిపించే పైని సూరజ్ లో చూశాడు. యువ భారతీయుడు రింకు సింగ్ హాలీవుడ్ లో మిలియన్ డాలర్ ఆర్మ్%-% తో పాపులరయ్యాడు. ఇది మాత్రమే కాదు.. అతను ప్రముఖ టీవీ సిరీస్ హోంల్యాండ్ లో అయాన్ ఇబ్రహీం పాత్ర పోషించాడు. అతను ఏదో ఒక రోజు హాలీవుడ్ టాప్ నటుడిగా ఎదిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. నెవర్ హ్యావ్ ఐ ఎవర్ లో మైత్రేయి రామకృష్ణన్ నటించారు. నెట్ ఫ్లిక్స్ ఫిల్మ్ ద నెదర్ ఫీల్డ్ గాల్స్ లోనూ అవకాశం దక్కించుకున్నారు.

# కల్కి 2898 ఏడీ.. ఆ డీల్ ఇంకా సెట్టవ్వలేదా?



పాన్ ఇండియా స్థాయిలో భారీ అంచనాల మధ్య విడుదలైన కల్కి 2898 ఏడీ, వెయ్యి కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లతో బ్లాక్ బస్టర్ హిట్ గా నిలిచింది. సినిమా విడుదలై మూడు నెలలు దాటినా, ఓ కీలక విషయంలో మాత్రం ఇంకా ఇబ్బంది ఎదుర్కొంటుందనే టాక్ వినిపిస్తోంది. అది సినిమాకు సంబంధించిన శాటిలైట్ హక్కులు. పలు చానెల్స్ తో సంప్రదింపులు జరుపుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఈ డీల్ ఫైనల్ కాలేదని సమాచారం. ఈ సమస్య వెనుక కొన్ని కీలక అంశాలు ఉన్నాయి. సినిమా యూనిట్ డిమాండ్ చేస్తున్న రేటుకు, మరియు టీవీ చానెల్స్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్న ధరకు భారీ వ్యత్యాసం ఉండటంతో, డీల్ ఇంకా పూర్తికాలేదని సమాచారం. స్టార్ మా, జీ గ్రూప్ వంటి ప్రముఖ చానెల్స్ తో చర్చలు జరుగుతున్నప్పటికీ, ఇప్పటివరకు ఫలితంగా ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ పెరుగుతున్న నేపథ్యంలో, టీవీ చానెల్స్ కు ఆదాయంలో తగ్గుదల చోటుచేసుకుంటోంది. ముఖ్యంగా, బిగ్ బడ్జెట్ సినిమాలు నాలుగు వారాల గ్యాప్‌లోనే ఓటీటీలో విడుదలవుతుండటంతో, ప్రేక్షకులు ఎక్కువగా టీవీ కంటే ఓటీటీ వైపు మళ్లుతున్నారు. ఈ నేపథ్యంలో, టీవీ చానెల్స్ ద్వారా వచ్చే ఆదాయంలో తగ్గుదల ఉండటం సహజం. అంతేకాకుండా, లీగల్ గా అప్రూవ్ కాకపోయినా, చాలా చోట్ల లోకల్ కేబుల్ ఆపరేటర్లు తమ ప్రైవేట్ ఛానెల్స్ ద్వారా సినిమాలను ప్రసారం చేస్తున్నారు, దీనివల్ల చందాదారులను నిలబెట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ పరిణామం కూడా శాటిలైట్ డీల్స్ ఆలస్యానికి కారణంగా భావించవచ్చు. ఇప్పటివరకు ప్యాన్ ఇండియా సినిమాలకు ఓటీటీ ద్వారా వచ్చే ఆదాయం చాలా ఆకర్షణీయంగా ఉంటుంది. అందువల్ల, నిర్మాతలు ముందుగా ఓటీటీ హక్కులను సొంతం చేసుకుని, ఆ తర్వాతే శాటిలైట్ హక్కుల కోసం చర్చలు మొదలుపెడుతున్నారు. ఈ సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్న సమయంలో, శాటిలైట్ ద్వారా వచ్చే ఆదాయం తగ్గిపోవడం సహజమేనని అంటున్నారు సినీ విశ్లేషకులు. ఇది కేవలం కల్కి 2898 ఏడీ సినిమాకే పరిమితం కాకుండా, ప్యాన్ ఇండియా సినిమాలన్నింటికి కూడా ఎదురవుతున్న సమస్య. గతంలో టీవీ చానెల్స్ ద్వారా భారీ మొత్తంలో ఆదాయం అందినా, ఇప్పుడు ఆ ఆదాయంలో గణనీయమైన తగ్గుదల చోటు చేసుకుంది. టీవీ సీరియల్స్‌కు వచ్చే ఆదరణను క్రమంగా సినిమాలు కోల్పోతున్నాయి. ఈ ట్రెండ్ ను మార్చడం ఇప్పట్లో సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

# నిర్మాతగా ‘సార్’ బ్యూటీ..!

మలయాళ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ తెలుగు లో భీమ్లా నాయక్ సినిమాలో నటించి మెప్పించింది. ఆ సినిమాలో హీరోయిన్ గా కాకున్నా తన నటనతో మెప్పించింది. ఆ తర్వాత వరుసగా బింబిసార, సార్, విరూపాక్ష సినిమాలతో సక్సెస్ ను దక్కించుకుంది. లక్కీ బ్యూటీ అంటూ పేరు సొంతం చేసుకున్న సంయుక్తం మీనన్ ఈ మధ్య కాలంలో సినిమాల సంఖ్య తగ్గించింది. వరుసగా సినిమాలు చేయకుండా ఆచితూచి సినిమాలకు కమిట్ అవుతున్న ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ ప్రస్తుతం నాలుగు అయిదు సినిమాలతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతోంది. ఈ ఏడాది ఇప్పటివరకు ఒక్క సినిమాతో రాని సంయుక్త మీనన్ వచ్చే ఏడాదిలో మూడు నాలుగు సినిమాలతో రాబోతున్నట్లుగా సమాచారం అందుతోంది. అందులో ఒకటి లేడీ ఓరియంటెడ్ మూవీ ఉందని తెలుస్తోంది. హీరోయిన్ గా మంచి ఆఫర్లు వస్తున్న సమయంలో అనూహ్యంగా ఈమె లేడీ ఓరియంటెడ్ సినిమాను చేయడం



విడ్డూరంగా ఉందంటూ కొందరు కామెంట్స్ చేస్తూ ఉంటే మరి కొందరు మాత్రం ఆమె తీసుకున్న సాహస నిర్ణయాన్ని అభినందిస్తున్నారు. రాజేష్ దండా నిర్మాణంలో ఒక భారీ లేడీ ఓరియంటెడ్ సినిమా రూపొందుతోంది. అందులో ఈమె హీరోయిన్ గా నటిస్తోంది. ఈ మధ్య కాలంలో హీరోలు ఎక్కువ మంది తమ సినిమాల నిర్మాణ భాగస్వామ్యులుగా ఉంటున్నారు. కొందరు తమ సినిమాలను తామే సమర్పించుకోవడం జరుగుతుంది. ఇప్పుడు సంయుక్త మీనన్ తన పారితోషికంతో పాటు కొంత మొత్తాన్ని సినిమాలో పెట్టి సమర్పకురాలిగా వ్యవహరించబోతుంది. ఇప్పటి వరకు సంయుక్త చాలా సినిమాల్లో హీరోయిన్ గా నటించింది. కానీ మొదటి సారి నిర్మాతగా సినిమాను చేసేందుకు సిద్ధం అయింది. తన నిర్మాణంలో తానే హీరోయిన్ గా నటిస్తున్న కారణంగా కచ్చితంగా సినిమాలో మ్యాటర్ ఉంటుంది అనే నమ్మకంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. సంయుక్త మీనన్ కేవలం తెలుగులో మాత్రమే కాకుండా తమిళ్, మలయాళ భాషల్లోనూ సినిమాలు చేస్తోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం రాజేష్ దండా నిర్మాణంలో ప్రస్తుతం సంయుక్త మీనన్ చేస్తున్న లేడీ ఓరియంటెడ్ మూవీ కథ మొదట సమంత వద్దకు వెళ్లిందట. ఆ సినిమా కథ ను సమంత ఓకే చెప్పింది. కానీ సమయం కావాలంటూ అడిగింది. చాలా రోజులు సమంత డేట్ల కోసం వెయిట్ చేసిన రాజేష్ దండా చివరకు ఆమె డేట్లు లభించక పోవడంతో చేసేది లేక సంయుక్త మీనన్ తో సినిమాను చేసేందుకు రెడీ అయ్యాడు అనే వార్తలు వస్తున్నాయి.

# యెల్లో ఫ్లేవర్‌తో గ్లామర్ డోస్ పెంచిన కావ్య!

కావ్య కళ్యాణ్ రామ్ ప్రస్తుతం సోషల్ మీడియాలో చాలా యాక్టివ్‌గా ఉంటూ, తన ఫోటోషూట్లతో అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇటీవల ఆమె పసుపు రంగు టాప్, డార్క్ షార్ట్స్‌లో పంచుకున్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ ఫోటోల్లో కావ్య తన సింప్లిసిటీకి తోడు గ్లామర్‌ని సమతూకంగా మేళవించి కనిపిస్తోంది. ఆమెకు కామెంట్ల రూపంలో భారీగా పాజిటివ్ రెస్పాన్స్ వస్తోంది. ఫ్యాషన్ స్టేట్‌మెంట్ విషయంలో కూడా ఆమె తనదైన శైలిలో అభిమానులను ఆకట్టుకోవడంలో సక్సెస్ అవుతోంది. కెమెరా ముందు ఆమె కంగారు లేకుండా కచ్చితంగా, ఆత్మవిశ్వాసంతో పోజులు ఇవ్వడం ఆమెకు ప్రత్యేకతను తెచ్చింది. ఈ ఫోటోషూట్‌లో ఆమె యొక్క ఎక్స్‌ప్రెషన్స్, బాడీ లాంగ్వేజ్, సొగసైన స్టిల్స్ ఆమె అందానికి మరింత ప్రత్యేకతను తెచ్చాయి. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసిన ఫోటోలకు వేలాదికి పైగా లైక్స్ రావడం చూస్తుంటే ఆమెకు ఉన్న ఫాలోయింగ్ ఎంతటిదో అర్థమవుతుంది. తన కెరీర్ విషయానికి వస్తే, “మసూద” మరియు “బలగం” సినిమాలతో టాలీవుడ్ ప్రేక్షకులకు



మరింత దగ్గరైంది. ఈ చిత్రాల విజయంతో ఆమె పేరు ఇండస్ట్రీలో బాగా ప్రాచుర్యం పొందింది. ఈ విజయాలతో పాటు, ఆమె చేస్తున్న ఫోటోషూట్లు కూడా ఆమెకు మరింత గుర్తింపు తెచ్చాయి. చిన్నప్పటి నుంచే చిత్రసీమలో అడుగుపెట్టిన కావ్య, తన ప్రతిభను నిరూపించుకుంటూ నెమ్మదిగా పెద్ద అవకాశాల వైపు అడుగులు వేస్తోంది. ప్రస్తుతం అమ్మడు రెండు సినిమాలతో బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలు కాకుండా కొత్త తరహా కంటెంట్ ఉన్న కథలను సెలెక్ట్ చేసుకుంటోంది. ఇక రానున్న రోజుల్లో ఒక బిగ్ పాన్ ఇండియా సినిమాలో కూడా కావ్య ముఖ్యమైన పాత్రలో నటించనున్నట్లు తెలుస్తోంది.




## ఎస్సీ వర్గీకరణ అమలుపై ఏకసభ్య కమిషన్.. నివేదిక వచ్చాకే జాబ్ నోటిఫికేషన్లు: సీఎం రేవంత్

హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు కోసం 60 రోజుల్లో నివేదిక ఇచ్చేలా ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక వచ్చాకే కొత్త ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. 2011 జనాభా లెక్కలను ప్రాతిపదికగా తీసుకోవాలని సీఎం సూచించారు. 24గంటల్లో కమిషన్‌కు కావాల్సిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ఉన్నత అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా ఏకసభ్య కమిషన్ నివేదిక సమర్పించాలని సూచించారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఎస్సీ వర్గీకరణపై గత కొంత కాలంగా రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనిపై ఇప్పటికే మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నేతృత్వంలో క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వివిధ అంశాలపై చర్చించిన క్యాబినెట్ సబ్ కమిటీ.. నిన్న నాలుగోసారి సమావేశమై ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఏకసభ్య న్యాయ కమిషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ నేపథ్యంలో బుధవారం సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ సబ్ కమిటీ సభ్యులు, ఇతర అధికారులు సమావేశమై చర్చించి ఏకసభ్య కమిషన్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

## ప్రతిపక్షం ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు: భట్టి



హైదరాబాద్: కొలువుల కోసమే ప్రత్యేక తెలంగాణ పోరాటం జరిగిందని.. అయినా, గత ప్రభుత్వం ఉద్యోగాల భర్తీపై ఎలాంటి చర్య తీసుకోలేదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విమర్శించారు. దశాబ్ద కాలం డీఎస్సీ గురించి ఆలోచన చేయలేదని ఆక్షేపించారు. పేదలకు నాణ్యమైన విద్య అందించాలనే తపనతోనే టీచర్ పోస్టులు భర్తీ చేసినట్లు తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరిచేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నామన్నారు. ప్రతిపక్షం డీఎస్సీపై ఎన్ని కుటిల ప్రయత్నాలు చేసినా, ఆటంకాలు సృష్టించినా అనుకున్న సమయానికి డీఎస్సీ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో టీచర్లకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేత కార్యక్రమంలో భట్టి మాట్లాడారు. "ఏళ్ల తరబడి పదోన్నతులు, బదిలీల్లేక టీచర్లు ఇబ్బందులు పడ్డారు. మా ప్రభుత్వం రాగానే టీచర్ల పదోన్నతులు, బదిలీలు పూర్తి చేసింది. డీఎస్సీపై ప్రతిపక్షం చాలా కుటిల ప్రయత్నాలు చేసింది. అయినా.. డీఎస్సీ ప్రక్రియ ఆగలేదు" అన్నారు. మరోవైపు, రాష్ట్రంలో 10వేల మందికి పైగా అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో 11,062 పోస్టుల భర్తీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. కేవలం ఏడు నెలల్లోనే మెగా డీఎస్సీ ప్రక్రియను రేవంత్ సర్కార్ పూర్తి చేసింది. డీఎస్సీ పరీక్షలకు 2.46లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. బ్యాక్‌లాగ్ పోస్టులు మిగిలిపోకుండా మొత్తం ప్రక్రియను ప్రభుత్వం పూర్తి చేసింది. మొత్తం 2,515 స్కూల్ అసిస్టెంట్లు, 685 భాషా పండితులు, 6277 ఎస్జీటీ, 145 పీఈటీ, 103 స్పెషల్ ఎడ్యుకేటర్ల పోస్టులు, 281 ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులను భర్తీ చేశారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లా నుంచి 761మంది, అత్యల్పంగా పెద్దపల్లి జిల్లా నుంచి 82మందినియామక పత్రాలు అందుకోనున్నారు. కోర్టు కేసులు, ఇతర సమస్యలతో 1056 పోస్టుల భర్తీ ప్రక్రియ పెండింగ్‌లో ఉంది.

## మూసీ నిధుల్లో రూ.లక్ష కోట్లు కాజేయాలని కాంగ్రెస్ కుట్ర: కేటీఆర్



హైదరాబాద్ :తెలంగాణలో దసరా పండుగ జరుపుకునే వీలులేకుండా భయానక వాతవరణం సృష్టించారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేత మహ్మద్ అల్లావుద్దీన్, పలువురు నేతలు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో గులాబీ తీర్థం పుచ్చుకున్నారు. కేసీఆర్ సీఎంగా ఉంటే రైతుబంధు, ఆడబిడ్డలకు బతుకమ్మ చీరలు వచ్చేవన్న కేటీఆర్... బతుకమ్మ ఆడుకునేందుకు వీలులేకుండా డీజేలు బంద్ చేశారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలను భయాందోళనకు గురి చేస్తోందని ఆక్షేపించారు. రైతులకు పూర్తి రుణమాఫీ కాలేదన్నారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలు ఇస్తామన్నారు. రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీకి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని ఎద్దేవా చేశారు. తులం బంగారం ఇస్తామన్నారు. 1.7 కోట్ల మంది మహిళల్లో ఒక్కరికి కూడా రూ. 2500 రాలేదని అన్నారు. మూసీ పేరిట రూ.లక్ష కోట్లు కొల్లగొట్టి.. కాంగ్రెస్ కాజేయాలని చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు. కమీషన్లు రావు కాబట్టే హామీలు అమలు చేయడం లేదన్నారు. హామీలు అమలు చేయాలని కాంగ్రెస్ ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు, నేతలను నిలదీయాలన్నారు. హరియాణాలో కాంగ్రెస్‌కు ప్రజలు బుద్ధి చెప్పారని.. ఆ ఫలితాలు చూసైనా రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి హామీలు అమలు చేయాలని సూచించారు. హైదరాబాద్‌లో ప్రతి ఒక్కరూ కేసీఆర్ లేని లోటును గుర్తు చేసుకుంటున్నారని వ్యాఖ్యానించారు. కక్షగట్టి తన సోదరి కవితను అరెస్ట్ చేసి తీహాడ్ జైల్లో పెట్టారని... అయినా భయపడకుండా పోరాడుతూనే ఉంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గం కొడంగల్‌లో రైతులు, ప్రజలకు అండగా నిలబడిన మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డిని దుర్మార్గంగా అరెస్ట్ చేశారని, రైతులపై లాఠీ ఛార్జ్ చేశారని కేటీఆర్ మండిపడ్డారు. పట్నం నరేందర్ రెడ్డి, నేతలను వెంటనే విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

## హైదరాబాద్‌లో మందకృష్ణ మాదిగ అరెస్ట్.. ఎందుకంటే



హైదరాబాద్, అక్టోబర్ 9: ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు మందకృష్ణ మాదిగను పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణను అమలు చేయకుండా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాల పోస్టులను భర్తీ చేయడాన్ని నిరసిస్తూ మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఈరోజు (బుధవారం) ఇందిరాపార్క్ ధర్నా చౌక్ నుంచి మాదిగల నిరసన ప్రదర్శన చేపట్టారు. అయితే ఈ నిరసనను పోలీసుల అడ్డుకున్నారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగతో పాటు, పలువురు ఎమ్మార్పీఎస్ నేతలను ఖాకీలు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఇందిరాపార్క్ వద్ద ఎమ్మార్పీఎస్ నేతలు, పోలీసులకు మధ్య వాగ్వివాదం తోపులాట ఉద్రిక్తతకు దారి తీసింది. ఇందిరాపార్క్ ధర్నాచౌక్ నుంచి లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వరకు నిర్వహించ తలపెట్టిన మాదిగల నిరసన ధర్నాను పోలీసులు అడ్డుకున్నారు. అరెస్ట్ చేసిన ఆందోళనకారులను నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ.. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి స్పందించి మాదిగలకు డీఎస్సీ ద్వారా వచ్చే ఉద్యోగాలను కల్పించిన తర్వాతే నియామక పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. అలా కాకుండా ముందుగానే నియామక పత్రాలు అందజేయడం వల్ల మాదిగలు అన్యాయానికి గురయ్యే ప్రమాదం ఉందని ఆరోపించారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా చేపట్టే ఉద్యోగ నియామకాల్లో రిజర్వేషన్లు పాటించాలంటూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలను , కార్యకర్తలు ఉద్యమకారులను అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయలేదా అని ప్రశ్నించారు. అలాగే ర్యాలీలు నిర్వహిస్తున్న వారిని అడ్డుకొని అరెస్ట్ చేయడం దారుణమంటూ మందకృష్ణ మాదిగ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

## పదేళ్లలో కేసీఆర్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చింది?: మంత్రి పొన్నం



హైదరాబాద్: గత పదేళ్లలో కేసీఆర్ సర్కారు ఎన్ని ఉద్యోగాలు ఇచ్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. గాంధీ భవన్‌లో 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమం నిర్వహించారు. ప్రజలు, పార్టీ కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడారు. తాము చిత్తశుద్ధితో ఉద్యోగాలు భర్తీ చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రభుత్వంపై సంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వం 150 మందికి మాత్రమే విదేశీ విద్యానిధి ఇచ్చిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 500 మందికి విదేశీ విద్యానిధి ఇస్తోందని వివరించారు. ప్రభుత్వంపై మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి వ్యాఖ్యలను పొన్నం ప్రభాకర్ ఖండించారు. "మూసీ నిర్వాసితులకు పునరావాసం కల్పించాకే ఖాళీ చేయిస్తున్నాం. రెండు పడక గదుల ఇళ్లు ఇవ్వడంతో పాటు నిర్వాసితుల పిల్లల విద్యకు చర్యలు తీసుకుంటాం. బీసీ సంక్షేమ శాఖ, బీసీ కమిషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ శాఖ ద్వారా కులగణన చేపడతాం" అని పొన్నం ప్రభాకర్ తెలిపారు.




## కీలక పరిణామం.. సీఎం రేవంత్‌తో మల్లారెడ్డి భేటీ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. నిన్న, మొన్నటి వరకు ఉప్పు నిప్పుగా ఉన్న సీఎం రేవంత్, మాజీమంత్రి మల్లారెడ్డి ఈ రోజు సమావేశం అయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి వచ్చారు. తన మనమరాలి పెళ్లి ఉందని చెబుతున్నారు. పెళ్లి పత్రిక ఇచ్చేందుకు రేవంత్ ఇంటికి వచ్చానని స్పష్టం చేశారు. అంతే తప్ప ఇతర కారణం ఏదీ లేదని తేల్చి చెప్పారు. గతంలో వీరిద్దరూ తెలుగుదేశం పార్టీలో కలిసి పనిచేశారు. ముందుగా మల్లారెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరగా తర్వాత రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీలోకి వచ్చారు. ఆ సమయంలో భూ ఆక్రమణల గురించి ఇద్దరి మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. ఆ తర్వాత పరిస్థితులు మారాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. రేవంత్ రెడ్డి సీఎం పదవి చేపట్టారు. దాంతో మల్లారెడ్డి వెనక్కి తగ్గాల్సి వచ్చింది. ఒకానొక సమయంలో మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు ప్రయత్నించారని వార్తలు గుప్పుమన్నాయి. కాంగ్రెస్ పార్టీలో మల్లారెడ్డి చేరికను రేవంత్ రెడ్డి అడ్డుకున్నారని మల్లారెడ్డి అనుచరులు ఆరోపించారు. ఈ క్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి మల్లారెడ్డి రావడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**ఆక్రమణలు :** భూములను ఆక్రమించి కాలేజీలు నిర్మించారని మల్లారెడ్డిపై గతంలో రేవంత్ రెడ్డి ఆరోపణలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలపై ఇద్దరు నేతల మధ్య సవాళ్ల పర్వం కొనసాగింది. ఓ సందర్భంలో మల్లారెడ్డి తొడగొట్టి ఛాలెంజ్ చేశారు. రాజీనామా చేయాలని పరస్పరం డిమాండ్ చేసుకున్నారు. మంత్రి పదవికి రాజీనామా చేయాలని రేవంత్ సహా కాంగ్రెస్ నేతలు ఆ సమయంలో డిమాండ్ చేశారు. ఎన్నికలు జరిగిన తర్వాత పరిస్థితి మారిపోయింది. కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టడంతో మల్లారెడ్డి మింగలేక కక్కలేక ఇబ్బంది పడ్డారు.

**కూల్చివేత.. కేసులు :** మల్లారెడ్డి అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డికి సంబంధించిన కాలేజీ భవనాలను అధికారులు కూల్చివేశారు. కుత్బుల్లాపూర్‌లో గల దుండిగల్ ఎంఎల్ఆర్ఐటీ కాలేజీ భవనాలను నేల మట్టం చేశారు. చిన్న దామర చెరువు ప్రాంతంలో కబ్జా చేసి అక్రమంగా నిర్మించారని ఫిర్యాదు రావడంతో చర్యలు తీసుకున్నారు. అంతకుముందు ఓ భూ వ్యవహారంలో మల్లారెడ్డిపై కేసు నమోదైంది. 47 ఎకరాల భూమిపై బాధితుడు ఫిర్యాదు చేయడంతో కేసు ఫైల్ చేశారు. ఇటు కేసులు, అటు కాలేజీల కూల్చివేత మల్లారెడ్డి ఉక్కిరి బిక్కిరి అయ్యారు.

**టీడీపీ.. కాంగ్రెస్..? :** మల్లారెడ్డి ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీలో ఉన్నారు. వేరే పార్టీలోకి వెళతారని జోరుగా ప్రచారం జరుగుతోంది. ఇటీవల ఏపీ సీఎం చంద్రబాబును కలువడంతో తెలుగుదేశం పార్టీలో చేరతారనే వార్తలు గుప్పుమన్నాయి. తెలంగాణ టీడీపీ అధ్యక్ష పదవి చేపడతారనే ఊహాగానాలు వినిపించాయి.

ఇంతలో సీఎం రేవంత్ రెడ్డి ఇంటి ముందు మల్లారెడ్డి ప్రత్యక్షం అయ్యారు. దాంతో ఏం జరుగుతుందనే చర్చకు దారితీసింది. సీఎం రేవంత్ రెడ్డిని మల్లారెడ్డి ఎందుకు కలిశారు..? నిజంగా పెళ్లికి ఆహ్వానించారా..? లేదంటే రాజకీయాలు మాట్లాడారా..? కాంగ్రెస్ పార్టీలో చేరతారా..? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

## ప్రయాణికులకు అలర్ట్.. టికెట్ ఛార్జీల పెంపు..




హైదరాబాద్, అక్టోబర్ 09: పండుగ వేళ ప్రయాణికులకు షాకింగ్ న్యూస్ చెప్పింది టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం. దసరా వేళ స్పెషల్ బస్సుల పేరుతో ప్రయాణికుల జేబులకు చిల్లు పెట్టేందుకు సిద్ధమైంది. దసరా రద్దీ దృష్ట్యా స్పెషల్ బస్సులు నడుపుతున్నామని ప్రకటించిన ఆర్టీసీ.. ఆ బస్సుల్లో ప్రత్యేక ఛార్జీలు ఉంటాయని స్పష్టం చేసింది. దసరా రద్దీ నేపథ్యంలో ప్రత్యేకంగా 6,300 బస్సులు నడుపుతున్నామని ఆర్టీసీ ఎంపీ సజ్జనార్ ప్రకటించారు. అలాగే మహాలక్ష్మి స్కీమ్ కింద మరో 600 బస్సులను అదనంగా నడిపిస్తున్నామన్నారు. అయితే స్పెషల్ బస్సుల్లో అదనపు ఛార్జీలు ఉంటాయని సజ్జనార్ స్పష్టం చేశారు. రిటర్న్ జర్నీలో ఖాళీగా బస్సులు రావాల్సి ఉంటుందని.. అందుకే కొంత ఛార్జీలు పెంచడం జరిగిందని సజ్జనార్ వివరించారు. ఇప్పటికే కొన్ని బస్సులు నడుస్తున్నాయని.. గురువారం నుంచి మొత్తం బస్సులను నడిపిస్తామని ఆర్టీసీ ఎండీ సజ్జనార్ తెలిపారు. ఈ నెల 14వ తేదీ వరకు ఈ స్పెషల్ బస్సులు అందుబాటులో ఉంటాయని చెప్పారు. అయితే, మహాలక్ష్మి పథకంలో భాగంగా ఫ్రీ జర్నీ చేసే మహిళలు తప్పకుండా తమ ఆధార్ కార్డు చూపించాలని స్పష్టం చేశారు. కార్డు చూపించకుండా ఆర్టీసీ సిబ్బందితో వాగ్వాదానికి దిగొద్దని కోరారు.

**ప్రయాణికులతో బస్ స్టేషన్స్ కిటకిట..** దసరా సందర్భంగా నగరంలోని ప్రజలు తమ తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. ఇప్పటికే స్కూళ్లు, కాలేజీలకు హాలిడేస్ ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. దీంతో హైదరాబాద్‌లో హాస్టళ్లలో ఉండి చదువుకునే కాలేజీ విద్యార్థులంతా ఊరు బాట పట్టారు. పెద్దలు సైతం తమ తమ సొంతూళ్లకు పయనమవుతుండటంతో ఆర్టీసీ బస్టాండ్‌లన్నీ ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. బస్సుల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. ఇప్పటికే ప్రయాణికులకు సరిపడా బస్సులు లేవని ప్రయాణికులు ఆందోళనకు గురవుతున్నారు. మరో రెండు రోజులు పోతే.. ప్రయాణికుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉంది. దీనిని దృష్టిలో ఉంచుకుని.. మరిన్ని బస్సులను నడపాలని ఆర్టీసీ యాజమాన్యానికి ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## జీతం ఇచ్చేందుకు రెడీ.. మీరు సిద్ధమా అని సవాల్



హైదరాబాద్, అక్టోబర్ 09: తెలంగాణలో చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మించిన అక్రమ నిర్మాణాలపై రేవంత్ రెడ్డి సర్కార్ ఉక్కుపాదం మోపుతుంది. ఆ క్రమంలో ఏర్పాటు చేసిన 'హైడ్రా'.. ఆయా నిర్మాణాలను కూల్చివేస్తుంది. దీంతో రేవంత్ రెడ్డి సర్కార్‌పై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సోమవారం విలేకర్ల సమావేశంలో ఈ అంశంపై స్పందించారు. ఈ అక్రమణలను తొలగించకుంటే.. రానున్న రోజుల్లో ప్రజలకు తీవ్ర ప్రమాదం పొంచి ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. మూసి నది ప్రక్షాళనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క వివరించారు. మల్లు భట్టి విక్రమార్క చేసిన ఈ వ్యాఖ్యలపై కామారెడ్డి ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు వెంకట రమణారెడ్డి బుధవారం ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. డిప్యూటీ సీఎం చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అవాస్తవమన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో లక్షల కోట్ల విలువ చేసే అనేక స్థలాలు కబ్జాలకు గురయ్యాయని ఆయన ఆరోపించారు. వీటిలో కంపెనీలు ఏర్పాటు చేసుకునేందుకు విదేశీయులకు ఈ ప్రభుత్వం అనుమతులు సైతం ఇచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఈ పది నెలల్లో అనేక చోట్ల బఫర్ జోన్, ఎఫ్టీఎల్ పరిధిలో ఉన్న వాటికి ఈ రేవంత్ సర్కార్ ఈసీ సర్టిఫికెట్స్ కూడా జారీ చేసిందని ఆయన గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే ఇదంతా చేస్తుందని ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి మండిపడ్డారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కేవలం మధ్య తరగతి ప్రజలనే లక్ష్యంగా చేసుకుని మాట్లాడారన్నారు. ఇక భూములు ఆక్రమించిన బడా బాబులతోపాటు 30 కంపెనీల వివరాలు త్వరలో తాను బయట పెడతానని ఆయన స్పష్టం చేశారు. గ్రేటర్ హైదరాబాద్ నగర పరిధిలో వేలాది మంది ఇళ్ళు నిర్మించుకొనేందుకు వివిధ బ్యాంకులు లోన్లు ఇచ్చిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయితే ఇవన్నీ అవాస్తవమని మీరు నిరూపిస్తే నేను సూసైడ్ చేసుకొని చనిపోతానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి.. రేవంత్ సర్కార్‌కు సవాల్ విసిరారు. ఇక రాష్ట్రంలోని మొత్తం 119 మంది ఎమ్మెల్యేలు, 19 మంది ఎంపీలు, ఎమ్మెల్సీలు తమ జీతాలను నష్టపోయిన హైడ్రా బాధితులకు ఇద్దామని సీఎం రేవంత్ రెడ్డికి కామారెడ్డి ఎమ్మెల్యే సూచించారు. తన పది నెలల ఎమ్మెల్యే జీతం రూ. 20 లక్షలు ఇవ్వడానికి నేను సిద్ధంగా ఉన్నానని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అందుకు మిగతా వారంతా రెడీగా ఉన్నారా? సమాధానం చెప్పాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన సూచించారు.

## కాళరాత్రి దేవిగా దర్శనమిచ్చిన బాసర సరస్వతి అమ్మవారు



ముథోల్: నిర్మల్ జిల్లా బాసర శ్రీ జ్ఞాన సరస్వతీదేవి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా సాగుతున్నాయి. బుధవారం మూలా నక్షత్రం సందర్భంగా అమ్మవారు 'కాళరాత్రి దేవి' అవతారంలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. ఆలయ అర్చకులు, వేద పండితులు వేదమంత్రోచ్చరణల మధ్య అమ్మవారికి విశేష మూలానక్షత్ర యుక్త అష్టోత్తరనామార్చన పూజలు నిర్వహించారు. అనంతరం నైవేద్యం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. దీంతో దర్శనానికి సుమారు గంట సమయం పడుతోంది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ అధికారులు, పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. స్వచ్ఛంద సేవా సంస్థల నిర్వాహకులు క్యూ లైన్‌లో ఉన్నవారికి తాగునీరు అందజేస్తున్నారు. మూలా నక్షత్రం సందర్భంగా ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం చేస్తున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా మండపాలు ఏర్పాటు చేశారు. క్యూలైన్లలో చిన్నారులకు అధికారులు పాలు, బిస్కెట్లు పంపిణీ చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com